ప్రజా కలం

Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 27-10- 2026 | సంపుటి: 17, సంచిక: 206, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



దారి తప్పుతున్న
యువత..!

గొడవలు.. పరస్పర దాడులతో భవిష్యత్తు ప్రశ్నార్థకం!

ఆవేశానికి బదులు ఆలోచనకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఆందోళన కలిగిస్తున్న సర్కిల్ సంఘటనలు..?

చిన్నపాటి గొడవలకే రెచ్చిపోతున్న యువత!

ఉన్నత చదువులు, ఉజ్వల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 26 (ప్రజా కలం) :

ఇటీవల మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో యువత పరస్పరం దాడులు చేసుకొని పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన సంఘటనలు అందరిని ఆందోళనకు గురిచేస్తుంది. ఎలాంటి సంబంధం లేని వివాదాల్లో తలదూర్చడం, చిన్నచిన్న విషయాలకే గొడవలకు దిగడం, పరస్పర దాడులకు పాల్పడుతున్న ఘటనలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి.గడిచిన కొద్ది రోజులుగా సర్కిల్ పరిధిలో చోటుచేసుకుంటున్న ఇలాంటి పరిణామాలు విద్యాపంతులు, మేధావులను విస్మయానికి గురిచేస్తున్నాయి. అయితే ఇలాంటి సంఘటనల్లో మంచి భవిష్యత్తు ఉన్న యువత కూడా పోలీస్ కేసుల్లో చిక్కుకొని తమ భవిష్యత్తు తామే ప్రశ్నార్థకంగా మార్చుకునే పరిస్థితులు తెచ్చుకోలేకపోలేరు.. అన్న అభిప్రాయాన్ని కూడా విద్యావంతులు వెలిబుచ్చుతున్నారు. ఏమైనాప్పటికీ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన యువత సంయమనము సహనం పాటిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మేధావులు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం..

ముఖ్యంగా పిల్లల స్నేహాలు, అలవాట్లు, రోజువారీ కదలికలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాల్సిన అవసరం ఉంది. పిల్లల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వారితో మాట్లాడి సరైన మార్గంలో నడిపించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సరైన సమయంలో తల్లిదండ్రుల మార్గదర్శకత్వం, కుటుంబ సభ్యుల పర్యవేక్షణ లేకపోతే కొందరు యువత చెడు స్నేహాలకు ఆకర్షితులై వివాదాల్లో చిక్కుకునే ప్రమాదం ఉందన్న చర్చ జరుగుతోంది.

ఆలోచనకు ప్రాధాన్యం ఇవ్వాలి..

చిన్నచిన్న విషయాలకే గొడవలకు దిగుతూ, ఆవేశంలో దాడులకు పాల్పడుతున్న కొందరు యువత ప్రవర్తన ఆందోళన కలిగిస్తోంది. స్నేహితుల మధ్య మాటామాటా పెరగడం, చిన్నపాటి వివాదాలు వ్యక్తిగత కక్షలుగా మారడం, క్షణికావేశంలో ఘర్షణలకు దిగడం వంటి పరిణామాలు యువత భవిష్యత్తుపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అయితే యువత అంటే సమాజానికి బలం.. దేశ భవిష్యత్తుకు దిక్సూచి. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలు సాధించి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన వయసులో అనవసర వివాదాల్లో..

మిగతా 2లో...

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర సీఎం

సానుకూల స్పందన

- ముంబైలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం భేటీ
- తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లుగా నిర్ణయించాలన్న తెలంగాణ ప్రతిపాదనపై కీలక చర్చలు
- మహారాష్ట్రకు, తమ ప్రజలకు ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు సిద్ధమన్న ఫడ్నవీస్
- ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల చిరకాల సాగు, తాగునీటి ఆకాంక్షలను వివరించిన సీఎం రేవంత్ రెడ్డి
- గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు 152 మీటర్ల ఎత్తు ఎందుకు అవసరమో వివరించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధం



ముంబై : ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సమావేశమైంది. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై కీలక చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు. సమావేశం ప్రారంభంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు.

తరువాయి 2వ పేజీలో...

నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి
పూర్వ వైభవం

10రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లుల చెల్లింపు
పాలేరు నియోజవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి వెల్లడి



ఖమ్మం/నేలకొండపల్లి, అక్టోబరు 26 (ప్రజాకలం) : పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లిలో ఉన్న 3వ శతాబ్దానికి చెందిన చారిత్రక బౌద్ధ స్తూపాన్ని, పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నేలకొండపల్లిలో పర్యాటక సదుపాయాల కల్పన, బౌద్ధ స్థల సంరక్షణ/పునరుద్ధరణ పనులకు మంత్రిగారు శంకుస్థాపన వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 3వ శతాబ్దానికి చెందిన బౌద్ధ స్తూపాన్ని సుమారు 50–55 సంవత్సరాల క్రితం నేలకొండపల్లి గ్రామంలో గుర్తించారని, దేశంలోనే అత్యంత పెద్ద బౌద్ధ స్తూపాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధిని ప్రారంభించినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోయాయని అన్నారు. స్తూపం చుట్టూ ఉన్న ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో పురావస్తు శాఖ అధికారులు గతంలో జరిపిన తవ్వకాల్లో ఎన్నో పురాతన వస్తువులు లభ్యమయ్యాయని, వాటిని భద్రపరిచేందుకు స్థానికంగా వసతులు లేకపోవడంతో హైదరాబాద్ మ్యూజియంలో ఉంచారని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ప్రపంచవ్యాప్తంగా వచ్చిన బౌద్ధ మతస్థులు, స్థానికుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని, రాబోయే రోజుల్లో బౌద్ధ కట్టడాలపై అవగాహన ఉన్న ప్రముఖ నిపుణులను, అధికారులను ఇక్కడికి ఆహ్వానించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

ఖర్గే వ్యాఖ్యలు దిగజారుడు
రాజకీయాలకు నిదర్శనం



రేవంత్ తీరు నీరో చక్రవర్తిని తలపిస్తోంది
ఎస్ఐఆర్‌పై పచ్చి అబద్ధాలు.. కొండారెడ్డిపల్లికి వస్తా.. ఓట్లు ఎక్కడ తొలగించారో చూపండి
నవంబర్ 2న బీజేపీ భారీ పాదయాత్ర.. అమిత్ షా హాజరు

2

ఓట్ల చోరీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

ఎస్ఐఆర్ పరిశీలకులు ఏఐసీసీ కార్యదర్శి శరత్

నవంబర్ 1న ఢిల్లీ రాంలీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ
కాళేశ్వరం వైఫల్యాలపై అసెంబ్లీలో చర్చకు రండి
ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు
సంక్షేమం,సంక్షోభ నివారణే ధ్యేయంగా రేవంత్ సర్కార్ పాలన
రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్

పెద్దపల్లి,అక్టోబర్ 26 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి): దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కాలరాస్తూ పెద్ద ఎత్తున ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని ఏఐసీసీ కార్యదర్శి శరత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కేంద్ర ఎన్నికల సంఘం తన పారదర్శకతను కోల్పోయి కేంద్ర అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్, పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీశైలంలతో కలిసి ఆయన మాట్లాడారు.దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ఓటర్ల జాబితాల్లో జరిగిన అవకతవకలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బయటపెడుతున్నారని శరత్ గుర్తుచేశారు. ఒక్క మహారాష్ట్రలోనే లోక్‌సభ ఎన్నికల వేళ దాదాపు 39 లక్షల ఓట్లు,గత ఐదేళ్లలో మరో 32 లక్షల అనుమానాస్పద ఓట్లను సరైన ధ్రువీకరణ లేకుండా చేర్చారని మండిపడ్డారు.కర్ణాటక, హర్యానా,పశ్చిమ బెంగాల్‌లలోనూ ఇదే తరహా అక్రమాలు జరిగాయన్నారు.రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాలరాయడమే కాకుండా, దీనిపై ప్రశ్నించిన రాహుల్ గాంధీతో పాటు ఎంపీలను ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద పోలీసులు నిర్బంధించడం గర్హనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీ రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ,నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు,ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు,యువజన సంఘాలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తక్షణమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని,ఓటర్ల జాబితా అక్రమాలపై నిష్పాక్షిక విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



కాళేశ్వరం అక్రమాలపై అసెంబ్లీలో తేల్చుకుందాం
-ప్రభుత్వ విప్ విజయరమణారావు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు,బ్యారేజీల కుంగుబాటుపై దమ్ముంటే అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని


తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



సర్‌పై నిర్ణయాలన్నీ సమష్టిగా తీసుకున్నవే

సుప్రీంకోర్టులో కేంద్ర ఎన్నికల సంఘం అఫిడవిట్



న్యూఢిల్లీ, అక్టోబరు 26: కొత్త ఓటర్ల నమోదు కోసం తప్పనిసరి అయిన ఫారం –6లో ఎలాంటి మార్పులూ చేయలేదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్

తరువాయి 2వ పేజీలో...

దారి తప్పుతున్న యువత..!

మొదటి పేజీ తరువాయి..


చిక్కుకోవడం వల్ల విలువైన సమయం వృథా కావడమే కాకుండా విద్య, ఉద్యోగ అవకాశాలు, కుటుంబ గౌరవం దెబ్బతినే అవకాశం ఉంది. ఆవేశంలో తీసుకునే ఒక్క తప్పుడు నిర్ణయం జీవితాన్ని ఇబ్బందుల్లోకి నెట్టవచ్చు.

ఆవేశం కాదు.. ఆలోచన ముఖ్యం!

చిన్నపాటి సమస్య ఎదురైనప్పుడు సహనం పాటించడం, ఎదుటివారి మాట వినడం, చర్చల ద్వారా పరిష్కారం కనుగొనడం నేర్చుకోవాలి. స్నేహితుల ప్రేరేపణకు లోనై గొడవల్లో పాల్గొనడం, గుంపులుగా ఏర్పడి ఘర్షణలకు దిగడం, సామాజిక మాధ్యమాల్లో వివాదాలను మరింత పెంచడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. సమస్య తీవ్రమైతే పెద్దలు, కుటుంబ సభ్యులు లేదా సంబంధిత అధికారుల సహాయం తీసుకోవాలి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం..

యువత ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ తల్లిదండ్రులు వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలి. చదువు, ఉద్యోగ లక్ష్యాలు, క్రీడలు, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాల వైపు యువతను ప్రోత్సహించాలి. ఉపాధ్యాయులు, సమాజ పెద్దలు కూడా యువతకు క్రమశిక్షణ, బాధ్యత, పరస్పర గౌరవం వంటి విలువలను తెలియజేయాలి. యువత తమ శక్తిని గొడవలకు కాకుండా విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సాధన, క్రీడలు, సమాజ సేవకు వినియోగించాలి. క్షణికావేశానికి లోనుకాకుండా భవిష్యత్తు గురించి ఆలోచించాలి. గొడవలో గెలవడం కంటే జీవితంలో విజయం సాధించడం గొప్పది. యువత సన్మార్గంలో నడిచినప్పుడే కుటుంబాలు సంతోషంగా ఉంటాయి.. సమాజం ప్రశాంతంగా ఉంటుంది.. దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది.



సన్మార్గంలో నడిపిస్తే..

యువతను సన్మార్గంలో నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించడంతోపాటు, అక్రమ కార్యకలాపాలపై నిఘా పెంచాలని సూచిస్తున్నారు. యువత తమ శక్తిని గొడవలకు కాకుండా చదువు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవ వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలకు వినియోగించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, సమాజం సమష్టిగా కృషి చేసినప్పుడే యువతను సరైన మార్గంలో నడిపించగలుగుతారు. ఆవేశంతో సమస్యలను పెంచుకోవడం కంటే ఆలోచనతో పరిష్కరించుకోవడం నేర్చుకున్నప్పుడే కుటుంబాలకు గౌరవం, సమాజానికి ప్రశాంతత, యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తాయి.

కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తుకు నష్టం



యువత చిన్నపాటి గొడవలకు ఆవేశానికి లోనై కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని మెట్ పల్లి సీఐ సురేష్ బాబు అన్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. యువత అనవసర గొడవలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులపై దృష్టి సారించాలని సూచించారు. విద్యతోనే మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవచ్చని, తమ లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం కష్టపడాలని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని యువతకు పిలుపునిచ్చారు. ఆవేశంతో కాకుండా ఆలోచనతో ముందడుగు వేస్తూ తమ భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దుకోవాలని సీఐ సురేష్ బాబు సూచించారు.

– మెట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు

కేసుల పాలైతే భవిష్యత్తుకే నష్టం..

ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు, క్షణికావేశంలో చేసే దాడులు యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపవచ్చని, పోలీసు కేసులు, న్యాయపరమైన చిక్కులు విద్య, ఉద్యోగ అవకాశాలకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందని, యువత తమ శక్తిని గొడవలకు కాకుండా చదువు, ఉపాధి, క్రీడలు, సామాజిక సేవ వంటి నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని వ్యక్తిత్వ వికాస నిపుణులు పేర్కొంటున్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులు నిఘా పెంచాలని, యువతకు సంబంధించిన కార్యక్రమాలతో కౌన్సెలింగ్ అందించాలని స్థానికులు సూచిస్తున్నారు. యువతను సరైన మార్గంలో నడిపించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని. ఇప్పటికైనా అప్రమత్తమై యువత భవిష్యత్తును కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు.

ఖర్గే వ్యాఖ్యలు
దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం



రేవంత్ తీరు నీరో చక్రవర్తిని తలపిస్తోంది
ఎస్ఐఆర్‌పై పచ్చి అబద్ధాలు..
కొండారెడ్డిపల్లికి వస్తా.. ఓట్లు ఎక్కడ తొలగించారో చూపండి
నవంబర్ 2న బీజేపీ భారీ పాదయాత్ర.. అమిత్ షా హాజరు

హైదరాబాద్, అక్టోబరు 26 (ప్రజా కలం) :

ప్రధాని నరేంద్ర మోదీ తల్లిదండ్రులను ఉద్దేశించి కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాట్నా సభలో ప్రధాని తండ్రిని ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మల దహనం..

ప్రధాని మోదీని రాజకీయంగా ఎదుర్కొనే స్థాయి లేకనే కాంగ్రెస్ నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఆ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్లు తెలిపారు.

ఓట్లు ఎక్కడ తొలగించారో చూపండి..

ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తప్పుబట్టారు. ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధంగా కొనసాగుతున్నప్పటికీ అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతూ.. తన సొంతూరు కొండారెడ్డిపల్లికి వస్తానని, అర్హులైన ఓటర్ల ఓట్లు ఎక్కడ అన్యాయంగా తొలగించారో చూపించాలని కోరారు. ఎన్నికల సంఘం అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటును అక్రమంగా తొలగించదని అన్నారు. గతంలో కాంగ్రెస్ మంత్రులు చేసిన సవాళ్లను స్వీకరించిన తర్వాత వారు వెనక్కి తగ్గారని పేర్కొన్నారు.

13 కోట్ల ఓట్లపై వివరణ..

దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంపై రాంచందర్‌రావు గణాంకాలను ప్రస్తావించారు. ఎన్నికల సంఘం ASDD (Absent, Shifted, Dead and Duplicate) కింద ఓటర్ల వివరాలను పరిశీలించిందన్నారు. ఇందులో మరణించిన వారు, చిరునామాల్లో అందుబాటులో లేని వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు నమోదైన వారు ఉన్నారని వివరించారు. ఆధారాలు లేకుండా ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

'నీరో'లా రేవంత్ తీరు..

రాష్ట్రంలో కరువు, తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని రాంచందర్‌రావు విమర్శించారు. ''రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా రేవంత్‌రెడ్డి తీరు ఉంది'' అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని పలు మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, చెరువుల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయని తెలిపారు. హైదరాబాద్‌లోనూ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ఢిల్లీ పర్యటనలకు వెళ్లడం తగదన్నారు.

నవంబర్ 2న భారీ పాదయాత్ర..

కాంగ్రెస్ అరాచక వైఖరికి వ్యతిరేకంగా నవంబర్ 2న బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు రాంచందర్‌రావు ప్రకటించారు. 'లోక్‌తంత్ర బచావో–అరాచకత హఠావో' నినాదంతో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై పాదయాత్రలో పాల్గొంటారని వెల్లడించారు.

కాళేశ్వరం మరమ్మతులు చేపట్టాలి..

గోదావరి ఉమ్మడి నది అని, గోదావరి నది యాజమాన్య బోర్డు (GRMB) నిర్ణయాలను రెండు తెలుగు రాష్ట్రాలు గౌరవించాల్సిందేనని రాంచందర్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి (మేడిగడ్డ) బ్యారేజీ నాణ్యత లోపాలకు గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల బాధ్యతారాహిత్యమే కారణమని ఆరోపించారు. NDSA సూచించిన మరమ్మతులను అడ్డుకోవడం లేదని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా పనులను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి వివాదాలను రాజకీయాలకు ఉపయోగించుకుని ప్రాంతాల మధ్య విద్వేషాలు పెంచవద్దని సూచించారు. తెలంగాణలోని ప్రతి ప్రాంతానికి న్యాయబద్ధమైన నీటి వాటా దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాంచందర్‌రావు కోరారు.

'రాహుల్‌ను ప్రధాని చేస్తా' అనడం హాస్యాస్పదం..

రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేస్తానని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, అయితే కాంగ్రెస్ రాజకీయ బలం క్రమంగా తగ్గుతోందని రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. గత గణాంకాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ బలహీనపడుతుండగా బీజేపీ బలం పెరుగుతోందన్నారు. విఫలమైన ఉత్పత్తిని మళ్లీ మార్కెట్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నించడం లాంటిదే రాహుల్‌గాంధీని ప్రధాని అభ్యర్థిగా ప్రచారం చేయడం అని విమర్శించారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర సీఎం సానుకూల స్పందన

మొదటి పేజీ తరువాయి...

సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్బి చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఐదు దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ––మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు. అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని వివరించారు. ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని తెలిపారు. హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానన్నారు.

నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి పూర్వ వైభవం

మొదటి పేజీ తరువాయి...

తన పాలేరు నియోజకవర్గంలో మంత్రిగారు విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడమేగాక వివిధ ప్రగతి పనులకు శంకుస్థాపనలు చేశారు.

10రోజుల్లో ఫైనల్ బిల్లుల చెల్లింపు

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫైనల్ బిల్లులన్నింటినీ రాబోయే 10 రోజుల్లోగా లబ్ధిదారుల ఖాతాల్లో ఎలాంటి లంచాలకు తావు లేకుండా జమ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి ప్రకటించారు.

నేలకొండపల్లి రైతు వేదికలో నేలకొండపల్లి మండల లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ నేలకొండపల్లి మండలంలో మొదటి విడత కింద మంజూరైన 648 ఇళ్లలో సుమారు 620 ఇళ్లు పూర్తయ్యాయని, వివిధ కారణాల వల్ల మిగిలిన ఇళ్లను కూడా త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ఎన్నిన్నో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, కరెంటు, నీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో రైతన్నలు నష్టపోకూడదనే ఉద్దేశంతో రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు మంత్రి అన్నారు.

అంతకుముందు మంత్రి నేలకొండపల్లి మండలం అనాసాగరం నుండి పమ్మి వరకు 2.5 కిలోమీటర్ల మేర 2.80 కోట్ల అంచనా వ్యయంతో బి.టి.రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. పాలేరు నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై అన్ని ఇంజనీరింగ్ శాఖల అధికారులతో మంత్రిగారు సమీక్షా సమావేశం నిర్వహించారు. కుసుమంచి మండలం, గోరిల్లపాడు తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని మంత్రి పొంగులేటి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ దివాకర టిఎస్ , హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల ఎంపీడీవో ఎర్రయ్య, తహాశీల్దార్ రాంప్రసాద్, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీలోని నాయుడుపేట జంక్షన్, టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరయ్యారు

ఓట్ల చోరీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అనాలోచిత నిర్మాణాల వల్లే మేడిగడ్డ కుంగిపోయిందని అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు ఏర్పడ్డాయని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాగానే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణులతో సమగ్ర తనిఖీలు చేయించిందని,వారి సాంకేతిక నివేదిక,సాయిల్ టెస్టుల ఆధారంగానే మరమ్మతులు చేపడతామని స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఏ ఒక్క నియోజకవర్గానికైనా కాళేశ్వరం ద్వారా నిర్దిష్టంగా నీటి కేటాయింపులు చేస్తూ జీవో ఇచ్చారా అని కేటీఆర్,హరీష్ రావులను ప్రశ్నించారు. వైఎస్సార్ హయాంలో చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, లోయర్ మానేరు డ్యామ్,వరద కాలువ వంటి వన్నీ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే రూపుదిద్దుకున్నాయని,ఎల్లంపల్లి ద్వారా హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించిన ఘనత కూడా తమ పార్టీదేనని గుర్తుచేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన
–రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రామగుండం ఎమ్మెల్యే,డీసీసీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండలు,కరవు పరిస్థితులు నెలకొన్నప్పటికీ మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో, ప్రభుత్వ విప్ విజయరమణారావు సమన్వయంతో ప్రజలకు తాగు,సాగునీటి కొరత లేకుండా ఎస్సారెస్పీ,ఎల్లంపల్లి ద్వారా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టినప్పటికీ రేవంత్ సర్కార్ రైతు రుణమాఫీ,సన్నబియ్యం బోనస్,ఇందిరమ్మ ఇళ్లు,కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి హామీలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును కాపాడేందుకు ఓట్ బచావో – దేశ్ బచావో' నినాదంతో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్తున్నాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీశైలం,రామగుండం కార్పొరేషన్ చైర్మన్ మహంకాళి స్వామి,పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్‌పై నిర్ణయాలన్నీ సమష్టిగా తీసుకున్నవే

మొదటి పేజీ తరువాయి...

ఏకపక్షంగా కీలక నిర్ణయాలన్నీ తీసుకుంటున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు సంబంధించి కమిషన్ నిర్ణయాలన్నీ సమష్టిగా తీసుకున్నవేనని స్పష్టంచేసింది. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానంలో సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈసీలు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషీలు అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోకుండా సీఈసీ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించటంతో దేశవ్యాప్తంగా దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ వార్తా కథనం ఆధారంగా రాకేశ్‌కుమార్‌సింగ్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో కోవారెంటో రిట్‌ను దాఖలు చేశారు. ఏ అధికారంతో సీఈసీ సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారో వివరణ కోరాలని అభ్యర్థించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఈసీలో నిర్ణయాలు ఏకగ్రీవంగా అయినా, లేదంటే మెజారిటీ ప్రకారం తీసుకోవాలని గుర్తుచేశారు. ఎస్ఐఆర్‌పై కమిషన్ తీసుకున్న నిర్ణయాలన్నీ చెల్లవని ప్రకటించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. వివరణ ఇవ్వాలని ఈసీని ఈ నెల 5న ఆదేశించింది. దీంతో 15 అంశాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌ను ఈసీ సోమవారం దాఖలు చేసింది. ఇదే అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతోపాటు మరికొందరు కూడా పిటిషన్లు దాఖలు చేశారు. వాటన్నింటిని కలిపి ధర్మాసనం విచారించనుంది. ఒక వార్తా సంస్థ ప్రచురించిన కథనం న్యాయస్థానంలో సాక్ష్యంగా చెల్లదని ఈసీ తన అఫిడవిట్‌లో వాదించింది. వార్తా కథనం ఆధారంగా ఈసీ విశ్వసనీయతను ప్రశ్నించటం సరికాదని పేర్కొంది.

మహనీయుడు శ్రీ వాల్మీకి మహర్షి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 26(ప్రజా కలం): ప్రపంచానికి ధర్మం, న్యాయం, సత్యం, సేవా మార్గాలను చాటిన శ్రీ రామాయణ మహాకావ్య రచయిత, ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగాజిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ ఆ మహనీయుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ మాట్లాడుతూ ఇతిహాస రామాయణ మహాకావ్యాన్ని గ్రంథం రూపంలో మానవాళికి అందించిన మహనీయుడు మహర్షి అనిఅన్నదమ్ముల బంధాన్ని, ఇచ్చిన మాటకు కట్టుబడే విధానం, గురు భక్తి లాంటి ఆచరనీయమైన పద్ధతులను రామాయణం ద్వారా రచించారని గుర్తు చేశారు. శ్రీ వాల్మీకి జయంతి సందర్భంగా, మనకు జీవిత పాఠాలను నేర్పిన రామాయణాన్ని గుర్తు చేసుకోవాలి అని పేర్కొన్నారు.శ్రీ వాల్మీకి రచించిన రామాయణం, చెడు మీద మంచి విజయం సాధిస్తుందన్న సందేశాన్ని అందిస్తుంది అని అన్నారు.ఇది కేవలం ఒక కథ మాత్రమే కాదు, ధర్మం, నీతి, స్నేహం, కుటుంబ విలువలను మనకు నేర్పే ఒక అద్భుత పాఠంలా ఉ పయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్థివో మధు సుధన్, బిసి వెల్ఫెర్ అధికారి జయ రాజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు
సత్వరమే పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 26(ప్రజా కలం)

ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 45ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లాను.. కరువు జిల్లాగా ప్రకటించాలి

రూ. 2 వేల కోట్లు రైతులకోసం కేటాయించాలి

బిజెపి ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కొమ్ము రాంబాబు యాదవ్



వెల్గటూర్, సెప్టెంబర్ 26, ప్రజాకలం, ప్రతినిధి : జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాలల్లో రైతాంగం సాగు చేస్తున్న వరి, పత్తి, మొక్కజొన్న, పసుపు పంటలు ఎల్ నినో ప్రభావంతో ఎండిపోయే ప్రమాదం ఉన్నందున జగిత్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, సహాయక చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ ధర్మపురి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు యాదవ్ ఓ ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. ఎల్ నినో ప్రభావంతో జగిత్యాల జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురువక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. చేతి పంపులు , బావుల్లో పంట సాగుకు సరిపడా నీరు ఉండటం లేదని, దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఆలంబిస్తున్న కరెంటు కోతల వల్ల రైతులంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జగిత్యాల జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి, రెండు వేల కోట్ల నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగం అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన చేసి, పంట నష్టపోతున్న రైతుకు ఎకరాకు రూ. 40 వేలు నష్టపరిహారం అందించాలని కోరారు. కరువుతో అల్లాడిపోతున్న ప్రజలందరికీ తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు నిత్యవసర సరుకులు కూడా అందించాలని పేర్కొన్నారు

పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో వాల్మీకి జయంతి వేడుకలు



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 26 (ప్రజా కలం) భారతీయ సాహిత్యానికి ఆదికవిగా, ఆధ్యాత్మిక మార్గదర్శిగా, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డిఎస్పి రవి కుమార్, ఆర్.ఐ. సైదులు తో పాటు సిబ్బంది పాల్గొని మహర్షి వాల్మీకి కి ఘనంగా నివాళులు అర్పించారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ - బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 26 (ప్రజా కలం) జిల్లా ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

మెట్‌పల్లి హోటళ్లలో మున్సిపల్ అధికారుల మెరుపు దాడులు

- ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్వాధీనం..

- పరిశుభ్రత పాటించని వారికి రూ.10 వేల జరిమానా

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 26 (ప్రజాకలం): –పట్టణంలోని పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు మెరుపు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోటళ్లలో పార్శిళ్ల కోసం నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగిస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

అదేవిధంగా పరిశుభ్రత నిబంధనలు పాటించని వారికి రూ. 10 వేల జరిమానా విధించారు. హోటల్ నిర్వాహకులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పార్శిళ్ల కోసం ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగించరాదని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌తో పాటు జవాన్లు ముజీబ్, నరేష్, నిజాముద్దీన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





సర్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని పక్కాగా నమోదు చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

ఎస్. ఐ.ఆర్. లో ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలి

భౌతిక, ఆన్‌లైన్ రికార్డులు, ఆధారాలను భద్రంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 26 (ప్రజా కలం) భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఎస్. ఐ.ఆర్. లో ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని నిర్దేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియకు సంబంధించి సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అడిగిన వెంటనే వివరాలు అందించేందుకు అవసరమైన రికార్డులు, ఆధారాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్లను చేర్చడానికి లేదా తొలగించడానికి సంబంధించి తగిన ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలను తప్పని సరిగా భద్రపరచాలని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలి ఉన్న సుమారు 4.50 లక్షల పెండింగ్ పనులను రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో, ఈ వారం చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్.ఐ.ఆర్. నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసి, ముగించాలని ఆదేశించారు.అనర్హులుగా గుర్తించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణాలు, తగిన డాక్యుమెంట్లు, ఆధారాలను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తుల ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చినట్లు తెలిపారు. అనర్హతకు సంబంధించిన ఆధారాలను రాజకీయ పార్టీలు, ఆర్‌టీఐ దరఖాస్తుదారులు లేదా ఇతరులు కోరినప్పుడు అందించేందుకు సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు.ఫారం–6 దరఖాస్తుల పరిశీలనతో పాటు పెండింగ్ పనులను నవంబర్ 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారం–7కు సంబంధించిన పెండింగ్ పనులను కూడా అదే గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ దరఖాస్తులకు సంబంధించిన అవసరమైన పత్రాలు, ఆధారాలను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎల్.ఓ., ఏ.ఎల్.ఓ., ఈ.ఆర్.ఓ., బి.ఎల్.ఓ. స్థాయిల్లో అన్ని రికార్డులు, డాక్యుమెంట్లను భౌతికంగా, ఆన్‌లైన్‌లో భద్రంగా నిర్వహించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఏవైనా న్యాయపరమైన వివాదాలు తలెత్తినా, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు వచ్చినా వెంటనే అవసరమైన సమాచారం, ఆధారాలు అందించేలా రికార్డుల నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్లు సక్రమంగా నమోదయ్యేలా, అనర్హుల పేర్ల తొలగింపునకు సంబంధించి నిబంధనల ప్రకారం తగిన ఆధారాలు ఉండేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ జిల్లాలో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తుకు సంబంధించిన వివరాలు, ఆధారాలను సేకరించి, సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను భౌతికంగా, ఆన్‌లైన్‌లో భద్రపరచాలని, సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరినప్పుడు లేదా న్యాయపరమైన అవసరాలు ఏర్పడినప్పుడు వెంటనే అందించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్.ప్రసునంభా, ఈ.ఆర్.ఓ.లు,ఏ.ఈ.ఆర్.ఓ.లు,సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్వైజర్ ఆరా తీస్తేనే కదలిక..?

- 11 దాటిన తెరుచుకొని అంగన్వాడి కేంద్రం



మల్లాపూర్, అక్టోబర్ 26 (ప్రజాకలం ప్రతినిధి):

చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య అందించాల్సిన అంగన్వాడీ కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించిందనే విమర్శలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం–2 సోమవారం సూపర్వైజర్ ఫోన్ చేసే వరకు తెరుచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంగన్వాడి కేంద్రం ముసి ఉంది అని ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభారాణి కి సమాచారం తెలియడంతో సదరు అంగన్వాడీ టీచర్ కు ఫోన్ చేసి ఆరా తీస్తే అంగన్వాడీ టీచర్ భోజనానికి వెళ్లినట్లు సమాధానమిచ్చినట్లు సమాచారం. అయితే సూపర్వైజర్ ఫోన్ చేస్తేనే అంగన్వాడి సెంటర్ ను ఓపెన్ చేశారని లేదంటే చేసే వారు కాదని స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తం అయ్యాయి. అయితే చిన్నారులు లేకుండా అంగన్వాడి కేంద్రాన్ని తెరిచి సూపర్వైజర్ కు సమాచారం ఇచ్చినట్టు స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. చిన్నారులకు సేవలందించాల్సిన అంగన్వాడి కేంద్రం ఇలా మూసి ఉండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సదరు అంగన్వాడీ కేంద్రం నిర్వహణపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటమి అక్కసుతోనే అసత్య ప్రచారాలు

మాజీ సర్పంచ్ వెంకటేష్‌పై పరువునష్టం దావా వేస్తాం - కల్లెపల్లి అశోక్, శ్రావణ్, నవీన్



పెద్దపల్లి,అక్టోబర్ 26:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి మండలం రాఘవపూర్ మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేష్ తమపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ రాఘవపూర్ గ్రామస్తులు కల్లెపల్లి అశోక్, మోదుంపల్లి శ్రావణ్, కుమ్మరి నవీన్‌లు పెద్దపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తీవ్రంగా మండిపడ్డారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,స్థానిక ఎన్నికల్లో ఓడిపోయిన అక్కసుతోనే తమపై బురదజల్లుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని,తమకు ఇల్లు కట్టించానని,బైక్ కొనిచ్చానని అబద్ధాలు చెప్తున్న వెంకటేష్ తన ఇంటి నిర్మాణంలో ఒక్క వీఎస్ఆర్ ఇటుక ఉన్నట్లు నిరూపించినా ఇంటిని తామే స్వయంగా కూల్చేస్తామని సవాల్ విసిరారు.కిరాణా దుకాణం కోసం భార్య పుస్తెలతాడు తాకట్టు పెట్టి,లోన్ తీసుకుని సొంత కష్టంతో బతుకుతుంటే,దబ్బులు ఇచ్చానంటూ తప్పుడు మాటలు మాట్లాడటం సిగ్గుచేటని,చెరువు శిఖం భూముల కబ్జా,ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై నిలదీస్తున్నందుకే తమపై కక్షగట్టి అక్రమ కేసులు,గంజాయి పేరిట అసత్య ఆరోపణలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉంటే పోచమ్మ గుడి వద్ద ప్రమాణానికి రావాలని, లేనిపక్షంలో నిరాధార ఆరోపణలు చేసినందుకు గాను న్యాయపరంగా పరువునష్టం దావా వేస్తామని వారు హెచ్చరించారు.

తెలంగాణ ఉద్యమకారుల
అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

- బెల్లంపల్లి పట్టణ ఉద్యమకారులు



బెల్లంపల్లి, అక్టోబర్ 26, (ప్రజాకలం) ప్రతినిధి. జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరుతున్న ఉద్యమకారులను అరెస్టు చేసి నిర్బంధించడము సరి కాదని బెల్లంపల్లి పట్నం ఉద్యమకారులు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసులు సైతం లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కష్టపడి పని చేసిన తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యమకారులకు కల్లిబొల్లి మాటలు చెప్పి ఉద్యమకారుల హామీలు నెరవేరుస్తామని హామీలు ఇచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా కూడా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం అయిందని ఆరోపించారు.ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలని కొన్ని డిమాండ్ల పైన సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడికి ప్రయత్నించిన ఉద్యమకారులను అణిచివేసే విధంగా బెల్లంపల్లిలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో నిర్బంధించటం జరిగిందని వెంటనే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల అందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనియెడల, భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యక్రమాలు రూపుదిద్దుకుంటామని ప్రభుత్వ హెచ్చరించారు.తమ డిమాండ్స్ 1)తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి.. 2)తెలంగాణ కోసం పనిచేసిన ఉద్యమకారులకు పెన్షన్లు ఇవ్వాలి3)ప్రతి ఉద్యమకారుడికి ఇల్లు మంజూరు చేయాలి. 4)ట్రైన్లలో బస్సులలో ప్రయాణించేందుకు ఉచితంగా పాసులు ఇవ్వాలి. 5)ప్రతి ఉద్యమకారుడు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. 6)ఉద్యమకారుల ఇంటికి 20 లక్షల వరకు వర్తించే హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు జారీ చేయాలి.వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో అరెస్టు అయిన వారిలో తెలంగాణ ఉద్యమకారులు ఎలిగేటి శ్రీనివాస్ పసులేటి వెంకటేష్, ఎరుకల సుందర్ రావు,పరిష రవిశ్వర్,విజ్జగిరి రాజేందర్, చిట్యాల మధు, శంకర్ సింగ్ ఉన్నారు..

ప్రజా కలం
మంగళవారం, అక్టోబర్ 27, 2026

జలసంరక్షణే శ్రీరామరక్ష

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు లు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేకపోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి. ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి.ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక యాక్సెస్ ప్రాంతీయ వార్తలు సేవ రాష్ట్ర వార్తలు సేవ మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి.. ప్రజలు భాగస్వాములు కావాలి.. జలసంరక్షణ ప్రతి ఇంటి సంకల్పంగా, ప్రతి గ్రామం లక్ష్యంగా, ప్రతి ప్రభుత్వ వ్యవస్థ కర్తవ్యంగా మారాలి. నీటిని కాపాడుకుందాం.. భవిష్యత్తును నిలబెట్టుకుందాం!

నైపుణ్య శిక్షణతోనే యువతకు మెరుగైన భవిష్యత్తు

- ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణ రావు



పెద్దపల్లి,అక్టోబర్ 26(ప్రజాకలం జిల్లాప్రతినిధి): జిల్లాలోని యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి,మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్,శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు స్పష్టం చేశారు.సోమవారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఇందులో భాగంగా రూ. 27 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల రెనోవేషన్ పనులతో పాటు,రూ. 25 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణ రావు మాట్లాడుతూ స్థానిక యువతకు ఉపాధి మార్గాలను సుగమం చేసేందుకే పెద్దపల్లిలో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.ఈ కేంద్రం ద్వారా ఇప్పటికే ఎంతో మంది శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారని,టాస్క్ ద్వారా ఇవ్వటివరకు కల్పించిన ఉద్యోగ అవకాశాలు,సాధించిన ప్రగతికి సంబంధించిన పూర్తి వివరాలతో వారం రోజుల్లో శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలో విద్యా మౌలిక వసతుల కోసం సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని,ఒక్క పెద్దపల్లి మండలంలోనే రూ.14 కోట్లు వెచ్చించామని వివరించారు.ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరగడంతో ఈ ఏడాది ఒక్క పెద్దపల్లి మండలంలోనే ప్రైవేట్ పాఠశాలల నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని తెలిపారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో గతంలో విద్యా ఫలితాల్లో 32వ స్థానంలో ఉన్న పెద్దపల్లి జిల్లా, ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో 8వ స్థానానికి ఎగబాకిందని కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరే రామ ట్రస్ట్ సహకారంతో ఏటా రూ.800 కోట్ల వ్యయంతో అల్పాహార పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని, ఎలాంటి ఆకర్షణలకు లోనుకాకుండా క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు హితవు పలికారు.కళాశాలల్లో విద్యార్థుల హాజరును కఠినంగా పర్యవేక్షించాలని, నిబంధనల ప్రకారం హాజరు శాతం లేనివారిని పరీక్షలకు అనుమతించవద్దని అధ్యాపకులకు సూచించారు.ఈ విషయంలో ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండబోవని తేల్చిచెప్పారు. పేదలకు విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని,పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సేవలు మెరుగుపడి ఇటీవల నాలుగు అవార్డులు సాధించిందని తెలిపారు.స్థానిక సంస్థల ఆదాయాన్ని మరింత పారదర్శకంగా మార్చేందుకు కళాశాల,ఆనువత్రి ప్రాంగణాల్లోని దుకాణాల అద్దెలు నేరుగా ఆయా సంస్థల అభివృద్ధి అవసరాలకే వినియోగించేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. పెద్దపల్లి టాస్క్ కేంద్రం ద్వారా గత ఏడాదిన్నర కాలంలో దాదాపు 2,600 మంది యువతకు ఉపాధి లభించిందని వెల్లడించారు.ఉద్యోగాలు కల్పించడమే కాకుండా,వారు విధుల్లో కొనసాగుతున్నారా లేదా,నక్రమంగా వేతనాలు అందుతున్నాయా అనే విషయాలపై మూడు నెలల పాటు నిరంతరం ఫాలోఅప్ చేస్తున్నామని తెలిపారు.గ్రామీణ ప్రాంత మహిళలు ఇంటి వద్ద నుంచే పనిచేస్తూ ఆదాయం పొందేలా వర్క్ ఫ్రమ్ హోమ్ నైపుణ్య శిక్షణనూ అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ,జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.కల్పన,కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ -వల్లెంకుంటలో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు

పెద్దపల్లి,అక్టోబర్ 26:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు,సామాజిక భవనాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.మంథని నియోజకవర్గం,మల్హర్ మండలం వల్లెంకుంట గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన నిర్మాణం కోసం తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ భవనాలు నిర్మించాలన్నదే మా లక్ష్య మని,వల్లెంకుంటలో అంబేద్కర్ భవన నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు, ముఖ్యంగా దళిత సమాజానికి సమావేశాలు,శుభకార్యాలు,సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రజల అవసరాలు, సమస్యలను నేరుగా తెలుసుకుంటూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాను అని పేర్కొన్నారు.నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తామని,భవన నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు కేటాయించడంపై వల్లెంకుంట గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపీ గడ్డం వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.



స్మార్ట్‌ఫోన్ మాయలో పడకండి

- అపరిచితులతో చాటింగ్.. కొరివితో తలగోక్కున్నట్టే
- జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కుంచం స్వప్న రాణి
- సెయింట్ ఆన్స్ విద్యార్థులకు సైబర్ ఉచ్చుపై మేల్కొలుపు



పెద్దపల్లి,అక్టోబర్ 26 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి): పాఠశాల స్థాయి విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ,చదువుపై దృష్టి సారించి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పెద్దపల్లి జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కుంచం స్వప్న రాణి పిలుపునిచ్చారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో సోషల్ మీడియా దుష్ప్రభావాలు – చట్టపరమైన అవగాహన అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి శ్రీనిజ కోహిర్కర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి కుంచం స్వప్న రాణి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే వయస్సులో ఎదుటి వ్యక్తుల నిజమైన ఉద్దేశాలను,మోసపూరిత మాటలను గ్రహించే మానసిక పరిపక్వత విద్యార్థులకు ఉండదని న్యాయమూర్తి పేర్కొన్నారు. తల్లిదండ్రుల స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి యాప్‌లను వాడుతూ అపరిచితులతో పరిచయాలు,చాటింగ్‌లు చేయడం వల్ల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దపల్లి పట్టణ పరిధిలోనే ఇటీవల 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తి మాయమాటలు నమ్మి మోసపోయిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ఆమె ఉదహరించారు.లైంగిక నేరాలకు కేవలం బాలికలే కాకుండా,అవగాహన లేకపోవడం వల్ల బాలురు కూడా బాధితులుగా మారుతున్నారని న్యాయమూర్తి హెచ్చరించారు.ఇంటర్నెట్‌లో అసభ్యకర,చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను వీక్షించడం,డౌన్‌లోడ్ చేయడం లేదా ఇతరులకు ఫార్వర్డ్ చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.ఢిల్లీలోని జాతీయ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో నిరంతర నిఘా కొనసాగుతుందని,ఎవరైనా ఇలాంటి కంటెంట్‌ను వీక్షిస్తే ఐపీ అడ్రస్ ఆధారంగా గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపుతారని స్పష్టం చేశారు.విద్యార్థులు స్వీయ నియంత్రణ పాటించాలని, తల్లిదండ్రులు సైతం పిల్లల మొబైల్ వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్యంపల్లి గ్రామపంచాయతీలో ఘనంగా కొమరం భీమ్ 86వ వర్ధంతి



బెల్లంపల్లి, అక్టోబర్ 26 (ప్రజాకలం) ప్రతినిధి : కొమరం భీమ్ 86వ వర్ధంతి నీ కాసిపేట మండలం హెడ్ క్వార్టర్ ముత్యంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు కొమరం భీమ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆదివాసి నాయకులు నాయక్, పోడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, ముత్యం పెల్లి మాజీ సర్పంచ్ ఆడే బాదు , నాయకులు పెద్రం శంకర్, మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి పోరాట యోధుడు కొమరం భీమ్ .జెల్ జంగల్ జమీన్ పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో సమాజం కోసం పోరాడాలని. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏఎం జిల్లా కార్యదర్శి సంకే రవి, బిజెపి మండల అధ్యక్షులు సూరం సంపత్ కుమార్, సామాజిక చైతన్య వేదిక ముఖ్య సలహాదారులు మద్దవేణి చిన్న భీమయ్య , బన్న రాములు, హేమచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు..

అంటరానితనం పై అలుపెరుగని
పోరాటం చేసిన వ్యక్తి అంబేడ్కర్



గొల్లపల్లి అక్టోబర్ 26 ప్రజాకలం ప్రతినిధి : మండల కేంద్రంలో డా. బి ఆర్ అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక సేవకుడు ఎడమల భోజేందర్ రెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బోజెంధర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ అంటరానితనం, కుల వివక్ష,బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడరని ఆయన భారత దేశానికి ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర మధుసూదన్, సాతల్ల లక్ష్మణ్, సిరికొండ తిరుపతి, వేల్పుల రాజేష్, మరంపెల్లి రఘు,నరసాపురం రవీందర్, గొల్లపల్లి సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, శంకర్రావుపేట్ సర్పంచ్ గోలి గంగారెడ్డి, రంజిత్ రెడ్డి, కనుకుంట్ల లింగారెడ్డి, చిర్రా దిలీప్, వీ ఆర్ ఓ చెవులమద్ది మల్లేష్, చెవుల మద్ది రమేష్, మహమ్మద్ నజీర్ పాషా, అవారి చందు రజక సంఘం అధ్యక్షులు కలకోట సత్యం,వార్డు సభ్యులు చెవులమద్ది లత మల్లేష్, ఎరవేణి మద్దూరి నవీన్,రాహుల్, ఆవుల సాయి, కత్తెర్ల హరీష్, చెవుల మద్ది నరసయ్య, చెవుల మద్ది రాజలింగు, జేరిపోతుల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో దీర్ఘకాలిక అధికారుల బదిలీ చేపట్టాలి

- బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్

- కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణకు డిమాండ్

పెద్దపల్లి,అక్టోబర్ 26:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి పెంపునకు కార్మికులపై మాత్రమే ఒత్తిడి తేవడం సరికాదని,సంస్థాగత పరిపాలనలో పారదర్శకత,అధికారుల జవాబుదారీతనం పెంచాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.నిబంధనలకు విరుద్ధంగా ఏళ్ల తరబడి ఒకే స్థానాల్లో పాతుకుపోయిన అధికారులను వెంటనే బదిలీ చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా సింగరేణి పర్చేజ్ డిపార్ట్‌మెంట్‌లో జరిగే కొనుగోళ్లు, టెండర్ల కేటాయింపులు, కాంట్రాక్టులు, ధరల నిర్ణయం వంటి అంశాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ విజిలెన్స్ విభాగం ఎందుకు సమగ్ర విచారణ జరపడం లేదని ఆయన ప్రశ్నించారు.సింగరేణి విజిలెన్స్ విభాగం స్వతంత్రంగా పనిచేస్తోందా లేక ఉన్నతాధికారుల అవకతవకలను చూసీచూడనట్లు వదిలేస్తోందా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయన్నారు.సింగరేణి ప్రజల ఆస్తి అని,లక్షలాది మంది కార్మికుల చెమటతో నడుస్తున్న సంస్థలో అవినీతి ఆరోపణలపై యాజమాన్యం మౌనం వీడాలని స్పష్టం చేశారు.వెంటనే దీర్ఘకాలిక పోస్టింగ్‌లపై సమగ్ర సమీక్ష జరిపి అధికారులను బదిలీ చేయాలని,పర్చేజ్ డిపార్ట్‌మెంట్ కొనుగోళ్లపై స్వతంత్ర ఆడిట్ లేదా ఉన్నతస్థాయి విజిలెన్స్ విచారణ చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని,ఆ విచారణ నివేదికను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు.



మామపై అల్లుడి కత్తితో దాడి

మల్లాపూర్, అక్టోబర్ 26 (ప్రజాకలం ప్రతినిధి): మల్లాపూర్ మండలం వాల్గొండ తండాలో నీళ్ల విషయంలో తలెత్తిన వివాదం కుటుంబ ఘర్షణకు దారితీసిం ది. ఈ ఘటనలో తండాకు చెందిన దేవుళ్ల పెద్ద గంగారాం (45)పై ఆయన అల్లుడు బోదాసు అజయ్ (25) పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నీళ్ల విషయంలో మొదలైన గొడవలో అజయ్ తన మేనత్త పుష్పపై దాడికి యత్నించగా, ఆమె భర్త గంగారాం అడ్డుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో అజయ్ గంగారాం ఛాతీకింది భాగంలో మూడుసార్లు కత్తితో పొడిచినట్లు సమాచారం. దీంతో తీవ్రంగా గాయపడిన గంగారాంను వెంటనే మెట్పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఘటనకుసంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఆక్రమణలకు గురైన కాలువను పునరుద్ధరించాలి



మల్లాపూర్, అక్టోబర్ 26 (ప్రజాకలం ప్రతినిధి): మల్లాపూర్ మండల కేంద్రంలోని రైనాకుల చెరువు నుంచి దేవికుంటలోకి నీరు చేరే కాలువ ఆక్రమణలకు గురైందని, దానిని వెంటనే పునరుద్ధరించాలని గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు ఉపసర్పంచ్ సోమరెడ్డి, వార్డు సభ్యులతో కలిసి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలువను పునరుద్ధరిస్తే దేవికుంటలోకి నీరు చేరి, గ్రామంలో తాగునీటి అవసరాలకు కొంతవరకు పరిష్కారం లభించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కాలువ అందుబాటులో లేకపోవడం వల్ల భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంబంధిత అధికారులు కాలువ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలువకు పూర్వ వైభవం తీసుకొచ్చి దేవికుంటలోకి నీరు చేరేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యమకారుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి మచ్చ

హామీలు నెరవేర్చకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తాం

డా. కె.వి. కృష్ణారావు

ఖమ్మం అక్టోబర్ 26(ప్రజా కలం న్యూస్) తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలకు సైతం వెనుకాడని ఉద్యమకారులను హౌస్ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డా.



కె.వి. కృష్ణారావు పేర్కొన్నారు . ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు . ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై ఈ నెల 26వ తేదీలోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ డిమాండ్ పిలుపు మేరకు సీఎం ఇంటి ముట్టడి నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మొత్తం మీద ఉద్యమకారులను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు , అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు . తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను తక్షణమే వేగవంతం చేసి , పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు . ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు , ధర్నాలు , ఆందోళనలు చేపట్టి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో పగడాల నరేందర్ , లింగానబోయిన సతీష్ , డో కుపర్తి సుబ్బారావు , రెడ్డబోయిన వరలక్ష్మి , కామని అనంత లక్ష్మి , స్వరూప రెడ్డి , కమలమ్మ , ధన లక్ష్మీ , యాక లక్ష్మీ తదితరులు ఉన్నారు .

ముథోల్‌లో కోజాగిరి పౌర్ణమి శోభ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పవమాన విష్ణు యాగం

నిర్మల్ అక్టోబర్ 26 ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కోజాగిరి పౌర్ణమి వేడుకలు మండల కేంద్రమైన ముథోల్ లో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీ పశుపతినాథ్ శివాలయం, మహాలక్ష్మి మందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకాలు, యాగాలు, హారతులతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శనివారం, ఆదివారం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచసూక్త పవమాన అభిషేకం, పవమాన విష్ణు యాగం నిర్వహించారు. సోమవారం కోజాగిరి పౌర్ణమి సందర్భంగా శ్రీ పశుపతినాథ్ శివాలయంలో లఘు రుద్రాభిషేకం, మహాలక్ష్మి మందిరంలో శ్రీసూక్త అభిషేకం, హారతి నిర్వహించారు. పూజా కార్యక్రమాలతో పాటు హరికథ నిర్వహించి అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురుపాద పూజ ప్రాముఖ్యతను వివరించారు. గురువుల ఆశీస్సులు పొందుతూ, వారు బోధించిన మార్గంలో నడవడం ద్వారా ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వేదమూర్తి ఉమేష్ మహారాజ్ (టాక్లికర్), అవధూత్ మహారాజ్, రాజభావు శాస్త్రి, వసంత్ రావు దేశ్‌పాండే, నర్సింగ్ రావు దేశ్‌పాండే, ప్రకాష్ శాస్త్రి, ప్రణీత్ శాస్త్రి, మధుకర్ కొండ్పాక్ పాల్గొన్నారు. మహారాష్ట్రలోని పూర్ణ సమీపంలోని వేద పాఠశాల, గురుకులానికి చెందిన ఆచార్యులు, విద్యార్థులు హాజరయ్యారు..బీసీ సంఘం అధ్యక్షుడు వరగంటి విట్టల్, కోశాధికారి జిందంవార్ వెంకటేష్, ఉపాధ్యక్షుడు పల్లె నాగేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పోతన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదమూర్తులు, మహారాజ్‌లను శాలువాలతో సన్మానించి వారి ఆశీర్వాదాలు పొందారు. కోజాగిరి పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యాగాల్లో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.



ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ



ఎండపల్లి, అక్టోబర్ 26 : (ప్రజా కలం ప్రతినిధి) మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజున 'ప్రజావాణి' (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమం యథావిధిగా విజయ వంతంగా నిర్వహించ బడింది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన 04 అర్జీలు (దరఖాస్తులు) స్వీకరించ బడ్డాయి. అందులో మండల ప్రజా పరిషత్ పరిధిలో ఒక దరఖాస్తు, తహశీల్దార్ కార్యాలయ పరిధిలో ఒక దరఖాస్తు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఒక దరఖాస్తు. వచ్చిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయం తో పనిచేయాలని సమావేశం లో నిర్ణయించారు. ఈ ప్రజావాణి కార్యక్రమం లో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, మండల వ్యవ సాయ శాఖ అధికారి కామాల్ల మహేష్, వెటరనరీ అసిస్టెంట్ సర్జన్ ఫైమొద్దీన్, మండల విద్యాధికారి కార్యాలయ ప్రతినిధి కిషోర్ కుమార్ (అసిస్టెంట్), శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారి సిడిపిఓ, అంగన్వాడీ యం. ఆండాలు, ఇరిగేషన్ శాఖ వి. స్వప్న (అసిస్టెంట్ ఇంజనీర్) జాతీయ ఉపాధి హామీ పథకం రాజ్ కుమార్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఇస్లావత్ నరేష్ (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్) విద్యుత్ శాఖ ఏఈ బండి సమ్మయ్య, సంక్షేమ శాఖ ఎండి. అఫ్సర్ (సంక్షేమ అధికారి) ప్రజా సమస్యల తక్షణ పరిష్కార దిశగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమం లో వివిధ శాఖల సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి,అక్టోబర్ 26:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మహాకవి వాల్మీకి జయంతి పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఆదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తో కలిసి పాల్గొన్నారు.శ్రీ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి,జ్యోతి ప్రజ్వలన చేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహాకవి వాల్మీకి హైందవ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని,రామాయణ గ్రంథం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని కలెక్టర్ పేర్కొన్నారు.రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు,మానవ సంబంధాలు,విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు.మహాకవి వాల్మీకి రచించిన రామాయణం కారణంగానే మన దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉందని కలెక్టర్ తెలిపారు.నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన వసుదైక కుటుంబం అనే భావన రామాయణంతో ముడిబడి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

మహాకావ్యం రామాయణాన్ని రచించిన మహాకవి వాల్మీకి జయంతిని పండగగా జరుపుకోవడం సంతోషకరమని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఎం.రవీందర్,కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ ,బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,అక్టోబర్ 26:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ బి.శ్రీరాముల తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామం సర్పంచ్ గోగు రాజయ్య సర్వే నెంబర్ 390 మట్టి తవ్వకాలు రవణాకు సంబంధించి అనుమతులు లీజు పరిమితి అంశాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు సమర్పించగా ఏడి మైన్స్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన గుర్రం రామస్వామి సర్వేనెంబర్ 83,83/సి1, 83/సి3 లో తనకు వ్యవసాయ భూమి ఎకరం 35 గుంటలు ఉందని,తనకు పాస్ పుస్తకం ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ శ్రీరాంపూర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సుల్తానాబాద్ మండలం చిన్న బొంకూరు గ్రామానికి చెందిన చింతల చుక్కమ్మ తన పేరు మీద ఉన్న ఇంట్లోని ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకొని దొంగ పట్టా చేయించుకోవడానికి చూస్తున్న గుజ్జుల నారాయణరెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ సుల్తానాబాద్ కు.రాస్తూ విచారించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.శ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన మామిడి రామ్ కి గృహ జ్యోతి పథకం తన కుటుంబానికి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా శ్రీరాంపూర్ ఎంపీడీవో కు రాస్తూ పరిశీలించి అర్హత ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో బి.ప్రకాష్ సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల 14వ రోజు
నిరవధిక సమ్మె

నేడు అన్ని జిల్లాల్లో పోస్టల్ కార్డు ఉద్యమం

క్రమబద్ధీకరణ సాధించే వరకు పోరాటం ఆగదు : ఉద్యోగ భద్రతే మా హక్కు

నిర్మల్ అక్టోబర్ 26 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం, ఉద్యోగుల క్రమబద్ధీకరణ డిమాండ్‌తో నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా 14వ రోజు సమ్మె నిర్వహిస్తూ, తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పోస్టల్ కార్డు ఉద్యమం చేపట్టాలని ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపునిచ్చింది. ఈ ఉద్యమంలో భాగంగా ఉద్యోగులందరూ పోస్టల్ కార్డుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తమ డిమాండ్లను తెలియజేయాలని జేఏసీ కోరింది. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు క్రమబద్ధీకరణ ప్రక్రియను చేపట్టాలని విజ్ఞప్తి చేయనున్నారు.

ఉద్యోగుల 8 ప్రధాన డిమాండ్లు

రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి.

సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా క్యాడర్ ఫిక్సేషన్ చేసి, 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలి.

కాంట్రాక్ట్ ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు బదిలీ చేయడానికి సంబంధించిన జీఓ 1195ను పునఃపరిశీలించాలి. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దుచేసి, ఉద్యోగులను స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలో కొనసాగించాలి.

ప్రతి నెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలి.

ఏటా 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం లాయల్టీ బోనస్ చెల్లించి, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలి.

క్యాడర్‌తో సంబంధం లేకుండా మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలి.

విధుల్లో ఉన్న ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి అర్హతకు తగిన ఉద్యోగ అవకాశం కల్పించాలి.



ఐక్యతే బలం.. పోరాటమే మార్గం

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం మానవీయ దృక్పథంతో పరిశీలించి, పరిష్కరించాలని జేఏసీ కోరుతోంది. ఉద్యోగుల హక్కులు, భద్రత, వేతనాలు, క్రమబద్ధీకరణ సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేస్తోంది.

"ఉద్యోగ భద్రతే మా హక్కు.. రెగ్యులరైజేషన్ సాధించే వరకు పోరాటం ఆగదు.. ఐక్యతే మా బలం.. పోరాటమే మా మార్గం" అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని జేఏసీ పిలుపునిచ్చింది.

కలెక్టరేట్ లో ఘనంగా వాల్మీకి జయంతి

పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు



నిర్మల్ అక్టోబర్ 26 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఒక బోయవాడు గొప్ప కవిగా ఎలా మారాడో వాల్మీకి జీవితమే ఉదాహరణ అని చెప్పారు. ఆయన వల్లనే రామతత్వం అందరికీ బోధపడిందని, ఆయన రచించిన ఏడు కాండాల రామాయణం అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ఆయన జీవితాన్ని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ జయంతి వేడుకల్లో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, బిసి అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్పీ సంక్షేమ అధికారి దయానంద్, ఈడి ఎస్పీ కార్పొరేషన్ శంకర్, డిఈవో భోజన్న, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎల్డిఎం రామ్ గోపాల్, సహాయ బిసి అభివృద్ధి అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా వాల్మీకి సంఘ ప్రతినిధులు ఆకుల సుదర్శన్, వేల్పుల మల్లేష్, ఎండపల్లి అశోక్, ఆకుల రాజేశ్వర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 26 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం బాసర మండలంలోని మధాపూర్ గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి గ్రామంలో చేపట్టిన రీసర్వే గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది తప్పనిసరి క్షేత్రస్థాయి సర్వే సమయంలో అందుబాటులో ఉండాలన్నారు. సర్వే నిర్వహణకు సంబంధించిన రైతులకు సమాచారం ముందుగానే అందించాలన్నారు. సంబంధిత కమతాల రైతులంతా సర్వే సమయంలో అందుబాటులో ఉండేలా చూడాలని వివరించారు. సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు.ఈ పరిశీలనలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడివో దేవేందర్ రెడ్డి, రెవెన్యూ, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ వద్ద నిలిచిపోయిన బస్సు: నెట్టిన విద్యార్థులు



తానూర్, 26(ప్రజా కలం): భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తానూర్ పెట్రోల్ బంక్ సమిపంలో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది,దీంతో బస్సులో ప్రయాణిస్తున్న పాఠశాల, కళాశాల విద్యార్థుల సహాయంతో కండక్టర్ బస్సును తోయించి స్టార్ట్ చేయించారు, నిత్యం పాత బస్సులను నడపడం వల్లే ఇలాంటి ఇబ్బందులు వస్తున్నాయని, సకాలంలో గమ్యస్థానాలకు చేరలేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని విద్యార్థులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, అధికారు స్పందించి మంచి బస్సులను నడపాలని కోరుతున్నారు.

ఫైళ్ల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలి

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

కలెక్టరేట్ రికార్డు రూమ్, 'హెచ్', 'ఏ' సెక్షన్లలో ఆకస్మిక తనిఖీలు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 26: కలెక్టరేట్‌లో ఫైళ్ల పరిష్కారంలో వేగం పెంచడంతో పాటు రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లోని రికార్డు రూమ్‌తో పాటు 'హెచ్', 'ఏ' సెక్షన్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణ, ఫైళ్ల కదలిక, ఇన్‌వార్డ్, అవుట్‌వార్డ్ రిజిస్టర్ల నమోదును పరిశీలించారు.



కలెక్టరేట్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని రికార్డు రూమ్‌ను సందర్శించిన కలెక్టర్ రికార్డుల భద్రత, వర్గీకరణ, నిర్వహణ తీరును తనిఖీ చేశారు. రికార్డులను క్రమపద్ధతిలో భద్రపరచాలని, అవసరమైన సమయంలో సంబంధిత దస్త్రాలు సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రికార్డుల నిర్వహణలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.అనంతరం 'హెచ్', 'ఏ' సెక్షన్లలో ఫైళ్ల కదలికలను పరిశీలించి, ఇన్‌వార్డ్, అవుట్‌వార్డ్ రిజిస్టర్లలో నమోదైన వివరాలను తనిఖీ చేశారు. కార్యాలయానికి వచ్చే దరఖాస్తులు, వివిధ అంశాలకు సంబంధించిన ఫైళ్ల పరిష్కారంలో అనుసరిస్తున్న విధానాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే దరఖాస్తులు, ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫైల్ కదలికను సక్రమంగా నమోదు చేయాలని, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యాలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల,కలెక్టరేట్ ఏ .ఓ.సువర్ణ రాజ్, సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బాసర ఐఐఐటీలో నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు

రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు భౌతిక తరగతులు ప్రారంభిస్తాం: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 26 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

బాసర ఐఐఐటి (ఆర్జియుకేటీ)లో విద్యార్థులకు నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటి ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఐఐఐటి లో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిపి పదివేల మంది వరకు ఉంటారని, వారికి తాగునీరు, రోజువారి అవసరాల నిమిత్తం ప్రతి రోజూ దాదాపు15 లక్షల లీటర్ల వరకు నీరు కావాలని అన్నారు.గోదావరి నది వద్ద ప్రత్యేకంగా ఐఐఐటి కోసం 60 హెచ్ పి సామర్థ్యం గల మూడు మోటార్లు అందుబాటులో ఉండగా, వాటిలో ప్రస్తుతం ఒకటి పూర్తిస్థాయిలో పని చేయగా, రెండు పనిచేయడం లేదని అన్నారు. ఈ విషయం తమ దృష్టికి రాగానే రెండు మోటార్ల మరమ్మత్తుల కొరకు 8 లక్షల రూపాయలను కేటాయించినట్లు వివరించారు. ఇప్పటికే సంబంధిత సాంకేతిక నిపుణుల బృందం ఇంటెక్ వెల్ ను సందర్శించిందని తెలిపారు. పది రోజుల్లోనే రెండు మోటార్లను బాగు చేసి నీటి సరఫరాకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఒక మోటారు దాదాపు రోజుకు 25 లక్షల లీటర్లను సరఫరా చేయగలదని వివరించారు. ఈ నీరు ఐఐఐటి రోజువారీ అవసరాలకు సరిపోతుందని చెప్పారు. పెరుగుతున్న నీటి అవసరాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మరొక నూతన మోటార్ ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఐఐఐటి అవసరాలకు ఇంకనూ నీరు అవసరమైతే రోజుకు 10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయగలిగే సామర్థ్యం ఉన్న గ్రామపంచాయతీ ఇంటెక్ వెల్ నుంచి 1.3 నుంచి 1.5 ఎంఎల్ డి నీటిని అందిస్తామని అన్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీ నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

ఐఐఐటి ప్రాంగణంలో 29 ఎకరాల విస్తీర్ణంలో నీటి నిల్వ కుంట అందుబాటులో ఉందని, దాని ద్వారా కూడా ఐఐఐటి అవసరాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రస్తుతం ఆ కుంటను శుభ్రం చేసి మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

ప్రస్తుతం నీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేవని, విద్యార్థులకు రెండు, మూడు రోజుల్లోనే భౌతిక తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే భౌతిక తరగతులు ప్రారంభించేలా సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు రోజువారి నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. నీరు తగినంత లభ్యంగా ఉందని, నీటి సరఫరా లోనే కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.అంతకుముందు గోదావరి నది వద్ద గల ఐఐఐటికి నీటిని సరఫరా చేసే ఇంటెక్ వెల్ ను పరిశీలించారు. నీటి సరఫరా కు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు మోటార్లకు అవసరమైన పరికరాలను తెప్పించి, వీలైనంత త్వరగా మరమ్మతులను పూర్తిచేయాలని అన్నారు. ఆ తర్వాత ఐఐఐటి ప్రాంగణంలోని నీటి కుంటను, పంపు హౌస్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, గ్రిడ్ డిఈఈ, ఈఈ లు రాజేశ్వర్ రావు రాఘవేంద్ర రెడ్డి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడివో దేవేందర్ రెడ్డి, ఐఐఐటి డీన్ లు మహేష్, విఠల్, విద్యార్థి సంక్షేమ అధికారి నాగరాజు, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రూ.220 కోట్లతో 14 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం

నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సమగ్రప్రణాళిక - ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 26:

నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించి, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నగరంలో సుమారు రూ.220 కోట్లతో 14 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు సమగ్ర తాగునీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో, జైనల్లిపూర్‌లో నూతనంగా నిర్మించనున్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ నగరంలో తాగునీటి కొరత, నీటి సరఫరాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అందరికీ తెలిసిందేనన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, కొత్త కాలనీల ఏర్పాటు, నగర విస్తరణకు అనుగుణంగా మరింత పటిష్టమైన తాగునీటి సరఫరా వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని అన్ని ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. నగరంలో చేపడుతున్న 14 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణ పనుల్లో భాగంగా తాజాగా రెండు ట్యాంకులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో 1,000 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుకు రూ.172.58 లక్షలు, జైనల్లిపూర్‌లో 400 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న ట్యాంకుకు రూ.83.72 లక్షలు అంచనా వ్యయంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నిర్మాణాలు పూర్తయితే ఆయా ప్రాంతాలతో పాటు పరిసర కాలనీల్లో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు. మహబూబ్‌నగర్ నగరం భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీటి వనరులు, పైప్‌లైన్లు, నీటి నిల్వ ట్యాంకులు, పంపింగ్ వ్యవస్థల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, రాబోయే సంవత్సరాల్లో పెరగనున్న నీటి అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో పైప్‌లైన్ల విస్తరణ,



నీటి నిల్వ సామర్థ్యం పెంపు, పంపింగ్ వ్యవస్థల ఆధునికీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నగరంలోని అన్ని కాలనీలకు సమానంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.తాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని అధికారులకు సూచించారు. కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నీటి సరఫరాలో సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. నగర ప్రజల ప్రస్తుత అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తులోనూ నీటి కొరత తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ.220 కోట్లతో చేపడుతున్న తాగునీటి అభివృద్ధి పనులు మహబూబ్‌నగర్ నగరానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చేలా ఉంటాయని, అన్ని కాలనీల ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సిజే బెనహర్, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, రమేష్ బాబు, సిజే పూజిత, దేవ్లీ మేఘ్యానాయక్, శ్రీనివాస్ రాజు, తాహెర్, నాయకులు గుమ్మాల శ్రీనివాస్, మైత్రి యాదయ్య, చంద్రమౌళి, తుప్పలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పాలేరు అక్టోబర్ 26(ప్రజా కలం న్యూస్)

పాలేరు నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక శ్రీ శ్రీ సర్కిల్ లోని క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పీ. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ఇంజనీరింగ్, ఇరిగేషన్, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్ తదితర శాఖల అధికారులతో మంత్రి సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిధుల మంజూరుపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడూతూ అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని తెలిపారు. భూసేకరణ, ఇతర సాంకేతిక సమస్యలు ఉంటే సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా మారిన విద్యుత్ స్తంభాలను త్వరితగతిన షిఫ్ట్ చేసేలా విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు.

అభివృద్ధి పనుల్లో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం జరిగేలా, భూమికి బదులు భూమి, ఇంటికి బదులు ఇల్లు ఇచ్చే దిశగా వేగవంతమైన చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో పనుల బిల్లుల చెల్లింపుకు ఎలాంటి కొరత లేకుండా చూసేందుకు ప్రతి నెల 20 కోట్ల నుండి 25 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు.దేశవ్యాప్తంగా ఎల్నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున నీరు, విద్యుత్‌లను అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్ సరఫరా క్రమబద్ధీకరించడానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు రెండో పంట వేయకూడదని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి, స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ సిఈ వాసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శేఖర్ రెడ్డి, మెడికల్ ఈ ఈ ఉమామహేశ్వర రావు, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, వివిధ ఇంజనీరింగ్ శాఖల ఈఈ లు, డిఈ లు, తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో

గ్రామాలను పర్యటించాలి

ఎల్.నినో పరిస్థితులపై సమీక్షించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 26:

మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించాలని,ఆయా గ్రామాల్లో ఎల్.నినో పరిస్థితులపై సమీక్షించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటనలపై సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారులు బుధవారం మండలం లోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేయడంతోపాటు, తమ శాఖలకు సంబంధించిన కార్యక్రమాల అమలు తీరును పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి వారంలో కనీసం రెండు నుంచి మూడు గ్రామపంచాయతీలను సందర్శించాలని, ప్రతి నెలా తమకు కేటాయించిన మండలాల్లోని గ్రామాలను క్రమం తప్పకుండా పర్యటించాలని సూచించారు. కేవలం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని సందర్శించి సరిపెట్టుకోకుండా, మారుమూల గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎల్ నీ నో పరిస్థితుల వల్ల గ్రామాలలో త్రాగు నీటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రత్యేక అధికారులు వాటి పై దృష్టి సారించి నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక

ఎల్.నీ.నో వల్ల జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున రానున్న వేసవిలో తాగునీటి కొరత ఏర్పడకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లోని బోరుబావులు, చేతిపంపులు, నీటి సరఫరా వ్యవస్థలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్లు, కుళాయిల పనితీరును పరిశీలించాలన్నారు. ఎక్కడైనా నీటి లీకేజీలు, వృథా జరుగుతున్నట్లయితే వెంటనే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో రానున్న ఐదు నుంచి ఆరు నెలల పాటు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఎలాంటి ప్రణాళిక ఉందో పరిశీలించాలన్నారు. అవసరమైనప్పుడు నీటి ట్యాంకర్లను సిద్ధం చేసుకోవడం, వాటిని ఎక్కడి నుంచి నింపాలి, ఏయే గ్రామాలకు సరఫరా చేయాలి, నీటిని ఎక్కడ నిల్వ చేయాలి అనే అంశాలపై ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. నీటి సంరక్షణలో భాగంగా ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం వంటి పనుల పురోగతిని కూడా తనిఖీ చేయాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాల్లో నీరు, విద్యుత్ వృథాను అరికట్టాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరం లేనప్పుడు విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, ఏసీలను నిలిపివేయాలని కలెక్టర్ సూచించారు. నీరు, విద్యుత్ వృథాను అరికట్టడం ప్రతి అధికారి బాధ్యతగా భావించాలన్నారు. ఇదే విధానాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు.

వసతి గృహాల్లో నీటి వినియోగంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, బోరుబావుల నుంచి అవసరానికి మించి నీటిని వినియోగించకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్, నీటి వృథా నివారణకు అధికారులు స్వయంగా చర్యలు తీసుకోవడంతోపాటు, తమ పరిధిలోని సిబ్బందికి కూడా స్పష్టమైన సూచనలు ఇవ్వాలన్నారు.

పాఠశాలలు, ఆసుపత్రుల్లో సేవల నాణ్యతను పరిశీలించాలి

క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించాలని కలెక్టర్ తెలిపారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా, ప్రజలకు వైద్య సేవలు నక్రమంగా అందుతున్నాయా అనే అంశాలను పరిశీలించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఆహార నాణ్యత, పరిశుభ్రతను తనిఖీ చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా, పరిశుభ్రత పాటిస్తున్నారా అనే విషయాలను పరిశీలించి, లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు తమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలతోపాటు గ్రామంలోని ఇతర ప్రభుత్వ సేవల పనితీరును కూడా పరిశీలించాలని తెలిపారు. గ్రామస్థుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని, తమ అనుభవాన్ని ఉపయోగించి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలపై ఇకపై జరిగే సమీక్షల్లో వివరాలను పరిశీలిస్తామని, ఆదేశాలను నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ డి. ఆర్.ఓ ఎ.నిర్మల, జెడ్.పి.సి.ఈ.ఓ, ఇన్చార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దగ్గుల శ్రీకర్ రెడ్డి 2వ జన్మదిన వేడుకలు

నిరుపేదలకు స్వీట్స్, స్టీల్ డబ్బాలు పంపిణీ



తల్లాడ అక్టోబర్ 26 ప్రజా కలం న్యూస్ :తల్లాడ పట్టణానికి చెందిన మాజీ వీడీసీ చైర్మన్ దగ్గుల శ్రీనివాస రెడ్డి, లలిత కుమారి దంపతుల మనవడు, పుల్లారెడ్డి, సౌమ్యరెడ్డి దంపతుల కుమారుడు శ్రీకర్ రెడ్డి 2వ జన్మదిన వేడుకలను సోమవారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు, వాటర్ బాటిల్ పంపిణీ చేశారు. అదేవిధంగా ఏనుకూరు మండలంలోని కొత్త మేడిపల్లి గ్రామంలో ఆదివాసీల కోయ కుటుంబాలకు స్వీట్లతో పాటు ఐదు లీటర్లు విలువ చేసే స్టీల్ క్యాన్ డబ్బాలు పంపిణీ చేశారు. సుమారు 60 కుటుంబాలకు వీటిని అందించారు. ఈ సందర్భంగా శ్రీకర్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దగ్గుల కుటుంబ సభ్యులు దగ్గుల నర్సిరెడ్డి, అప్పిరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాస రెడ్డి దంపతులు, దామోదర్ రెడ్డి, చిన్నారులు పాల్గొన్నారు.

ఆది కవి వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి : ఎమ్మెల్యే బండ్ల



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజాకలం):

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం దాసరి పల్లి, బిజ్వారం, ఉలిగేపల్లి, మల్దకల్, శేషంపల్లి, తాటికుంట గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ ఆది కవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు, సర్పంచులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆది కవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ప్రజలందరికీ, వాల్మీకి సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి, శ్రీ సీతారాముల చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను, విలువలను ఆచరించాలని సూచించారు. గ్రామాల్లో వాల్మీకి మహర్షి విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించడం వల్ల పండుగ వాతావరణం నెలకొంటుందని అన్నారు. గద్వాల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.

రైతులు, ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని వాల్మీకి మహర్షి ఆశీస్సులు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ వై. సత్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ మురళి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు, వివిధ గ్రామాల సర్పంచులు వెంకటేష్, చిట్టెమ్మ, నాయకులు వెంకటన్న, భరత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తిప్పన్న, తలారి నర్సింహులు, నరేందర్, మధు నాయకి, నర్సింహులు, చిన్న రాముడు, ప్రతాప్, పరశురాముడు, ప్రవీణ్, తిమ్మప్ప, రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు ఆర్టీసీ అధికారులకు కనిపించడం లేదా?

బస్సు ఆపలేదని ప్రయాణికురాలి ఆరోపణ.. సిబ్బంది తీరుపై విచారణకు ఆదేశాలు!

ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకుంటాం: గద్వాల్ డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 26, ప్రజాకలం:

గద్వాల్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సిబ్బంది వ్యవహారశైలిపై ప్రయాణికురాలు చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ప్రయాణికుల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాల్సిన ఆర్టీసీ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలు ఈ ఘటనతో తలెత్తుతున్నాయి. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి గద్వాల్‌కు వస్తున్న TG 34 Z 0104 నంబరు గల బస్సు సాయంత్రం 5:45 గంటలకు కొత్తకోటకు చేరుకుంది. ఆ సమయంలో తన తల్లి, చెల్లెలు కూడా వస్తున్నారని, వారి ఆధార్ కార్డులు తన వద్దే ఉన్నాయని డ్రైవర్‌కు తెలిపి బస్సు ఆపాలని కోరినప్పటికీ బస్సు ఆపకుండా వెళ్లిపోయిందని ఆమె ఆరోపించారు. దీంతో పెబ్బేరు వద్ద బస్సు దిగి, మరో బస్సులో తనతల్లి, చెల్లెలితో కలిసి ప్రయాణించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో కండక్టర్ తనతో దురుసుగా మాట్లాడినట్లు కూడా ఆరోపించారు.

విచారణ తర్వాతే చర్యలు..

డిపో మేనేజర్ స్పష్టీకరణ

ఈ ఘటనపై గద్వాల్ డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్‌ను వివరణ కోరగా, ఈ విషయానికి సంబంధించిన సమాచారం విజిలెన్స్ అధికారుల ద్వారా ఉన్నతాధికారులకు చేరినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి విచారణ జరుపుతామని, ఆరోపణలు వాస్తవమని తేలితే సంబంధిత సిబ్బందిపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తాను డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టి 15 రోజులు మాత్రమే అయిందని, ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఫిర్యాదులను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ప్రయాణికుల భద్రత,

గౌరవం ఆర్టీసీ బాధ్యత కాదా?

ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు తేలికగా తీసుకోకుండా సమగ్రంగా విచారించాలని, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శ్రీశ్రీ ఆది కవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న బాసు హనుమంతు నాయుడు!



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 26 (ప్రజాకలం):

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శ్రీశ్రీ ఆది కవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు పాల్గొని వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధరూర్ మండలంలోని పార్చర్ల, అల్లపాడు, ధరూర్ గ్రామాలతో పాటు కేటీ దొడ్డి మండలంలోని గంగన్‌వల్లి, గువ్వలదిన్నె, నందిన్నె, చింతలకుంట గ్రామాల్లో, గట్టు మండలంలోని గట్టు, రాయపురం, ఆలూరు, రంగాపురం తండా, తుమ్మలచెరువు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గట్టు మండలం ఆలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలు గ్రామాలకు చేరుకున్న బాసు హనుమంతు నాయుడుకు వాల్మీకి కమిటీ సభ్యులు, మహిళలు బాణసంచా కాల్చుతూ, డోలు మేళాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వివిధ గ్రామాల్లో వాల్మీకి కమిటీ సభ్యులు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గద్వాల నియోజకవర్గ ప్రజలకు, వాల్మీకి సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. వాల్మీకి మహర్షి ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన బోధించిన విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాల్మీకి కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గద్వాలలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

- క్రీడాకారులకు కలెక్టర్ ప్రోత్సాహం!



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 26, ప్రజా కలం:


ప్రతిభగల క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న కలెక్టర్ స్వయంగా కాసేపు బ్యాటింగ్ చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన 10 జట్లు గద్వాలకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రీడాకారుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా అధికార యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి, డిసెంబర్ రెండో వారంలో గ్వాలియర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం స్టేడియంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల పరిశీలకులు డేవిడ్, ఇన్‌చార్జి డీవైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, స్టేడియం ఇన్‌చార్జి బషీర్, క్రీడా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

కొండపర్తిలో రహదారుల దుస్థితిపై

అధికారుల నిర్లక్ష్యం ఎంతకాలం?

- ఇటీవల కారు ఢీ కొని రెండు ఎద్దులు మృతి
- తీవ్రంగా గాయపడిన కొండపర్తి వాసి బొక్కల సురేష్
- ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్న పట్టించుకోరా?
- గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు..
- ప్రజల సమస్యలకు పరిష్కారం ఎప్పుడు?
- కలెక్టర్ ను కలిసి ప్రజల వినతి కనిపించేనా ఈసారైనా పురోగతి?



తేదీ: -10-2026

శ్రీయుత గౌరవనీయులైన జిల్లా కలెక్టర్, హనుమకొండ గారికి సమస్తంలంచి ప్రాయనది ఏమనగా.

అర్జా!

విషయము:- వర్ధన్నపేట నియోజకవర్గములోని స్టేట్ హైవే ఫండ్ (రోడ్ మంజూరైన రోడ్డు గత 3 సం॥ ల నుండి అట్టి రోడ్డును తమ కంకర పోసి పదిలపేయడం జరిగినది. అట్టి రోడ్డును వెంటనే నిర్మాణము చేయుట గురించి.

నేను అనగా మొక్కు నారాయణ, తండ్రి: యాకయ్య, నివాసము: కొండపర్తి, బసవేలు మండలము, హనుమకొండ జిల్లా గారిని. మా నియోజకవర్గానికి సంబంధించిన స్టేట్ హైవే ఫండ్ (రోడ్ మంజూరైన రోడ్డు గత 3 సం॥ ల నుండి అట్టి రోడ్డును తమ కంకర పోసి పదిలపేయడం జరిగినది. ఉదాం కొండపర్తి నుండి భట్టుపల్లి వరకు, కొండపర్తి నుండి తిమ్మాపూర్ క్రాస్, మొల్లుగూడెం నుండి బసవేలు, కొండపర్తి నుండి వనమల కనపర్తి తలిదార రోడ్డును మేయక పోవడం వలన గ్రామాలకు బస్సులు రావడం లేదు. మరియు టూ వీలర్స్ మెదలుకొని 4 వీలర్స్, 3 వీలర్స్ లాంటి వాహనాలు చెడిపోవుచున్నవి. గ్రామాలకు వచ్చి పోయే వారికి ఈ వాహనాల దుబ్బు వలన అనారోగ్యాలకు గురిఅవుతున్నారు. ఇదే కాకుండా ఒక రైతు బొక్కల సురేష్, తండ్రి: ఎల్లయ్య అను రైతు ఎద్దులుండిని కారు ఢీకొనడంతో అట్టి ఐండి వల్లిలు మరియు పశువులు మరణించడం, అతని సదుపు విరగడం జరిగినది. ఎన్నిసార్లు తమరి దృష్టికి తీసుకువచ్చినా అట్టి రోడ్డును నిర్మాణం చేయడం లేదు. గ్రామాలలో ఉన్న స్కూల్ పిల్లలు గాని, కాలేజీ విద్యార్థులు గాని రోడ్డు కారణంగా బస్సు రాకపోవడం వలన నానా ఇబ్బందులు పడుతున్నారు.

కావున వెంటనే పై ఇన్ని రోడ్డును నిర్మించి మా గ్రామాలకు రాకపోకలు కచ్చితంగా తగురవ్వలు తీసుకోగలరని మాయిమ్మ ప్రార్థన.

కృతజ్ఞతలతో,

ఇట్లు,
మీ విధేయులు,
(పొక్కుల నారాయణ)
స్టేట్ నాయకులు,
మహిషపు సోమప్పు పార్టీ,
సెల్ నెం. 9640078778

అక్టోబర్ 26 అయినవోలు:-
(ప్రజా కలం ప్రతినిధి)

గ్రామీణ అభివృద్ధికి రహదారులు ప్రాథమిక సూచికలు. గ్రామాల మధ్య రాకపోకలు సజావుగా సాగాలన్నా, రైతులు తమ పంటలను మార్కెట్లకు తరలించాలన్నా, విద్యార్థులు పాఠశాలలకు చేరుకోవాలన్నా, అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లాలన్నా మెరుగైన రహదారులు ఎంతో అవసరం. కానీ రహదారులే గుంతలమయమై, ప్రయాణం ప్రాణసంకటంగా మారితే గ్రామీణ అభివృద్ధి గురించి చెప్పుకునే మాటలకు అర్థమే ముంటుంది? హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని కొండపర్తి గ్రామ పరిసర ప్రాంతాల్లో రహదారుల పరిస్థితిపై వ్యక్తమవుతున్న ఆందోళనలు ఇదే ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. రహదారుల దుస్థితిపై ప్రజలు అధికారులకు వినతిపత్రం సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

అధికారుల దృష్టికి సమస్య వెళ్లినా..

పరిష్కారం ఎక్కడ?

కొండపర్తి నుంచి కొత్తపెల్లి మీదుగా వెళ్లే రహదారితోపాటు వనమాల కనపర్తి–తిమ్మాపూర్ మార్గం కూడా అసంపూర్తిగా ఉండటంపై గతంలోనే ప్రజలు, స్థానిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా పనులు పూర్తికాలేదన్న ఆరోపణలు రహదారుల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై అనేక సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ప్రజలకు అవసరమైన రహదారుల నిర్మాణం ఇంతకాలం ఎందుకు పూర్తికాలేదు? నిధుల కొరతే కారణమా? పరిపాలనా అనుమతుల్లో జాప్యమా? కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమా? లేక సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపమా? ఈ ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు చెప్పాల్సిన అవసరం ఉంది. ప్రజలు రహదారుల కోసం వినతులు సమర్పించడం ప్రజాస్వామ్యంలో వారి హక్కు అయితే ప్రతి సమస్యకు వినతిపత్రం ఇవ్వడం, అధికారుల చుట్టూ తిరగడం, ప్రజాప్రతినిధులను అభ్యర్థించడం తప్పనిసరి కావడం పాలనా వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

గుంతల రోడ్లతో నిత్యం నరకయాతన

రహదారుల దుస్థితి కేవలం ప్రయాణానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. దాని ప్రభావం గ్రామీణ ప్రజల దైనందిన జీవితంపై పడుతుంది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటారు. విద్యార్థులు సమయానికి పాఠశాలలకు చేరుకోవడంలో సమస్యలు ఎదుర్కొంటారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు రహదారుల పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తుంది. ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వ వ్యవస్థలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం పాలకుల బాధ్యత. రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం ఒక ఎత్తయితే, వాటిని సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం మరో ఎత్తు. రెండో అంశంలోనే నిర్లక్ష్యం చోటుచేసుకుంటే అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనం ప్రజలకు ఎలా అందుతుంది?

శంకుస్థాపనలకే పరిమితమా.. పనులు పూర్తిచేసే బాధ్యత లేదా??

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించడం ఎంత ముఖ్యమో, వాటిని నిర్ణీత గడువులో పూర్తి చేయడం అంతకంటే ముఖ్యం. ఒక రహదారి నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోతే ప్రజాధనం వినియోగం, పనుల పర్యవేక్షణ, అధికారుల బాధ్యత వంటి అంశాలపై సహజంగానే ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పరస్పరం నెట్టివేసుకోకుండా బాధ్యత తీసుకోవాలి. రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు ఎంత? ఇప్పటికే ఎంత ఖర్చు చేశారు? పనులు ఎక్కడ నిలిచిపోయాయి? వాటిని తిరిగి ప్రారంభించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలి. ఎందుకంటే ప్రజలకు కావాల్సింది హామీలతో కూడిన ప్రకటనలు కాదు. గుంతలు లేని రహదారులు, సురక్షిత ప్రయాణం, సమయానికి పూర్తయ్యే అభివృద్ధి పనులు.

ప్రజల వినతిపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

కొండపర్తి ప్రాంత రహదారుల సమస్యపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. సంబంధిత రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనులు అసంపూర్తిగా ఉండటానికి గల కారణాలను గుర్తించాలి. అవసరమైన నిధులు, అనుమతులు, నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలి. అసంపూర్తిగా ఉన్న రహదారుల పనులకు స్పష్టమైన గడువు నిర్ణయించి, వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. పనుల నాణ్యతపై పర్యవేక్షణ చేపట్టాలి. జాప్యానికి బాధ్యులెవరో గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా???

కొండపర్తి రహదారులకు మహర్దశ పడుతుందా? లేక ప్రజలు మరోసారి వినతిపత్రాలతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందేనా? ఈ ప్రశ్నలకు సమాధానం మాటల్లో కాదు.. క్షేత్రస్థాయిలో ఆచరణలో కనిపించాలి. అప్పుడే ప్రజలకు ప్రజాపాలన వ్యవస్థపైన నమ్మకం కలుగుతుంది

నూతన ఎస్‌హెచ్‌ఓకు కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు



బహిరంగ మద్యపానాన్ని అరికట్టాలి

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

పి ఏ సి యస్ డైరెక్టర్ కొండేటి మహేందర్

అక్టోబర్ 26 ప్రజాకలం ప్రతినిధి:(వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన భోగం ప్రవీణ్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు పి ఏ సి యస్ డైరెక్టర్ కొండేటి మహేందర్, పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్,సోమవారం రోజున మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, బహిరంగ మద్యపానాన్ని అరికట్టి యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు.పోలీస్ స్టేషన్‌కు సమస్యలతో వచ్చే బాధితుల పట్ల సానుకూలంగా వ్యవహరించి, వారి ఫిర్యాదులను ఓపికగా విని సత్వర న్యాయం అందేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.పట్టణంలోని ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో బహిరంగ మద్యపానంపై నిఘా పెంచాలని కోరారు. దీనివల్ల మహిళలు, విద్యార్థులు, యువతకు ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి ఏ సి యస్ డైరెక్టర్ కొండేటి మహేందర్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్,మాజీ కౌన్సిలర్ తుమ్మల, రవీందర్,ఐత సుధాకర్, సోహైల్ పులి శ్రీనివాస్,తోటకూరి శ్రీనివాస్,కొండేటి సుధాకర్,విసారపు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

గుల్లేపల్లి నవ్య శ్రీ కి పద్మశాలి ప్రతిభా పురస్కార్ అవార్డు ప్రధానం

ముఖ్య అతిథులు పాల్గొన్న రాపోలు ఆనంద భాస్కర్ పోపా : అసోసియేట్ అధ్యక్షులు మాటేటి సంతోష్

(వరంగల్/పర్వతగిరి)అక్టోబర్ 26, ప్రజాకలం ప్రతినిధి: పద్మశాలి అఫిషియల్స్ ఆ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా), వరంగల్ ఆధ్వర్యంలో ఆదివారం శివనగర్‌లోని పద్మశాలి కళ్యాణ మండపంలో పద్మశాలి ప్రతిభా పురస్కార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కాశీబుగ్గకు చెందిన గుల్లెపెల్లి శివకుమార్, పల్లవి దంపతుల కుమార్తె గుల్లెపెల్లి నవ్య శ్రీ తెలంగాణ ఈసెట్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగంలో రాష్ట్రస్థాయిలో 320వ ర్యాంకు సాధించినందుకు ప్రోత్సాహకంగా ఆమెకు ప్రతిభా పురస్కార్ అవార్డును అందజేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ పోపా, వరంగల్ అసోసియేట్ అధ్యక్షులు మాటేటి సంతోష్, పాలకవర్గ సభ్యులు చేతుల మీదుగా నవ్య శ్రీ కి ప్రతిభా పురస్కార్ అవార్డు ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, వారి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ పురస్కారం తనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని నవ్య శ్రీ పేర్కొంటూ, అవార్డును అందించిన పోపా, వరంగల్ పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- మామునూరు నాలుగో బెటాలియన్ లో ఓపెన్ హౌస్



హనుమకొండ అక్టోబర్ 26 ప్రజా కలం ప్రతినిధి మామునూరు నాలుగో బెటాలియన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కమాండెంట్ ఎన్.వి.ఎస్.శ్రీనివాస్ రావు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంకు బెటాలియన్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్,సిల్వర్ క్రౌన్ స్కూల్,హ్యాపి ది స్కూల్,మదర్ థెరిస్సా స్కూల్ మొత్తం 6 పాఠశాలల నుండి మొత్తం 770 మంది విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పోలీస్ సిబ్బంది వివిధ రకాల ఆయుధాల పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భవిష్యత్తులో ఇండియన్ ఆర్మీ,నేవీ, ఎయిర్ ఫోర్స్,రాష్ట్ర పోలీస్ వ్యవస్థలలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సి.వంశీ మోహన్ రెడ్డి,అసిస్టెంట్ కమాండెంట్స్ ఈ.వీరన్న,బి.రాజు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కార్తీక్,రవి,రాజ్కుమార్,రాంప్రసాద్,కృష్ణ మరియు రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్,బెటాలియన్ ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు తక్షణ చర్యలు

- కాలిపోయిన మోటారు స్థానంలో కొత్త మోటారు ఏర్పాటు..

- తాగునీటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ ముందస్తు చర్యలు



ఐనవోలు, అక్టోబర్ 26:-(ప్రజాకలం ప్రతినిధి) గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా పెరుమాండ్లగూడెం గ్రామ సర్పంచ్ దుప్పెల్లి రాకేష్ తక్షణ చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని పెరుమాండ్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో వరంగంటి ఎల్లయ్య వ్యవసాయ భూమి వద్ద ఉన్న ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించిన పీడబ్ల్యూఎస్ మోటారు అధిక వినియోగం, ఎండ తీవ్రత కారణంగా కాలిపోయింది. దీంతో గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందని గుర్తించిన సర్పంచ్ రాకేష్ వెంటనే స్పందించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకూడదనే లక్ష్యంతో యుద్ధప్రాతిపదికన కొత్త మోటారును కొనుగోలు చేసి, వరంగంటి ఎల్లయ్య వ్యవసాయ భూమి వద్ద ఉన్న బోరులో అమర్చేలా చర్యలు తీసుకున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలస్యం చేయకుండా మోటారు ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి తీవ్రతతో పాటు రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టడం సర్పంచ్ బాధ్యతాయుతమైన పాలనకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, గ్రామంలో తాగునీటి సరఫరా సజావుగా కొనసాగేందుకు సర్పంచ్ రాకేష్ తీసుకున్న చొరవను గ్రామస్తులు అభినందిస్తున్నారు.



బీబీనగర్ చెరువు వద్ద మతమార్పిడుల ఆరోపణలు!

బాలికలను ప్రలోభపెట్టి మతమార్పిడులా?

విచారణ జరపాలని అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

బీబీనగర్, అక్టోబర్ 26 (ప్రజాకలం):

బీబీనగర్ చెరువు పరిసరాల్లో మతమార్పిడులు జరుగుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపాయి. కొంతమంది బాలికలను ప్రలోభపెట్టి మతమార్పిడులకు పాల్పడుతున్నారనే అనుమానాలపై గ్రామస్తులు సోమవారం మండల ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, సీఐ సూర్యనాయక్ లకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా వినాయకుడి పూజలు నిర్వహించిన ప్రాంతంలో ఈ వ్యవహారం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. బాలికలను ప్రలోభపెట్టి మతమార్పిడులకు ప్రయత్నిస్తున్నారనే అనుమానాల నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను తేల్చాలని వారు విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి ఈ అంశాన్ని పరిశీలించి, సంబంధిత పాస్టర్‌ను పిలిపించి మాట్లాడతామని తెలిపినట్లు గ్రామస్తులు వెల్లడించారు. ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయో లేదో నిర్ధారించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంక్షేమ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల శంకర్, ఎండోమెంట్ మండల్ కో-కన్వీనర్ పంజాల ప్రవీణ్ గౌడ్, వేముల శ్రీకాంత్, పూసల సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షుడు మర్రి వెంకటేశ్, టంటం లక్ష్మీనారాయణ, దేవర్పుల శ్రీధర్, గోరుగంటి శివ, కట్టా చరణ్, వై. శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- సీఐ సూర్య నాయక్

పోచంపల్లి రోడ్డు చౌరస్తాలో వాహనల తనిఖీలు

- రహదారి భద్రతపై అవగాహన

బీబీనగర్, అక్టోబర్ 26 (ప్రజాకలం): బీబీనగర్ పట్టణ కేంద్రంలోని పోచంపల్లి రోడ్డు చౌరస్తా వద్ద సోమవారం సీఐ సూర్యనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు



వాహనల తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీఐ సూర్యనాయక్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు కచ్చితంగా నంబరు ప్లేట్లు బిగించుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ప్రతి వాహనదారుడు రహదారి భద్రతా నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని పోలీసులు కోరారు. ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మన్ బాపూజీ కూతురికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

రాష్ట్ర పద్మశాలి నేతల విజ్ఞప్తి...

మేడిపల్లి అక్టోబర్ 26(ప్రజాకలం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎనలేని కృషిచేసిన కొండా లక్ష్మన్ బాపూజీ కూతురు,కొండా లక్ష్మన్ ట్రస్ట్ చైర్మన్ సామాజిక కార్యకర్త పద్మశాలి డాక్టర్ పవిత్ర బాపూజీకి ఎమ్మెల్సీ ఇవ్వాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్ కోరారు.రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్ పిలుపు మేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర నాయకులు,జిల్లాల నేతన్నలు, నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల సభలో పద్మశాలి బిడ్డకు ఎమ్మెల్సీ ఇస్తామని ప్రకటించిన విధంగా ఎమ్మెల్సీ ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసారు.ఈ సమావేశంలో బోడుప్పల్ పద్మ శాలి సంఘం వ్యవసస్థాపక అధ్యక్షులు సాయిని అమృతం, అధ్యక్షులు వర్కల వెంకటస్వామి, ముఖ్య సలహా దారు డా: లక్ష్మివీరమల్లు, బొల్లిగూడెం నాయకులు దేవేందర్,వెంకటేష్ వివిధ జిల్లా నాయకులు పాల్గొని డా:పవిత్ర వాణికి మ్మెల్సీ ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు.



భాషిత కళాశాలపై విచారణ జరపాలి

నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి విద్యార్థి సంఘం నాయకుల వినతి

స్పందించకుంటే కార్యాలయాల ఎదుట ఆందోళనకు హెచ్చరిక



కుత్బుల్లాపూర్, అక్టోబరు 26 (ప్రజాకలం): చింతల్ ఐడీపీఎల్ ప్రాంతంలోని భాషిత జూనియర్ కళాశాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థి సంఘం జాతీయ సమన్వయకర్త మన్నె జీవన్, రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కళాశాల నిర్వహణపై వచ్చిన ఆరోపణలను అధికారులు తక్షణమే పరిశీలించి, సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా కళాశాల నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే చట్టప్ర కారం కళాశాలను మూసివేయాలని డిమాండ్ చేశారు.

స్పందించకుంటే ఆందోళనలు: విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందిం చి తగిన చర్యలు తీసుకోకపోతే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాల యం, ఇంటర్మీడియట్ విద్యామం డలి కార్యదర్శి కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్థు లకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణే తమ లక్ష్యమని, న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గబోమని నాయకులు పేర్కొన్నారు.

ఘనంగా తుంగతుర్తి రవి పుట్టినరోజు వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు

ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు

మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తుంగతుర్తి రవి



మేడిపల్లి
అక్టోబర్ 26(ప్రజాకలం న్యూస్)

మల్కాజ్గిరి మున్సివల్ కార్పొరేషన్ బోడుప్పల్ నర్మల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,ఆర్ వి ఫౌండేషన్ వ్యవస్థా పకులు తుంగతుర్తి రవి జన్మదిన వేడుకలు సోమవారం మేడిపల్లిలోని బండి కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరిగాయి.ఈ వేడుకలలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తోటకూర వజ్రేష్ యాదవ్,రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్,జిల్లా కమిటీ సభ్యులు, పలు డివిజన్ ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపార ప్రముఖులు, డివిజన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని తుంగతుర్తి రవిని ఘనంగా సన్మానించి,కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నోటు పుస్తకాలు, పెన్నులు బహుమతిగా ఇచ్చారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండి రాజకీయ, వ్యాపార రంగంలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకొని ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు చేయాలని ఆకాంక్షించారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ప్రత్యక్షంగా,సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా, శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ తన కోరిక మేరకు నోటు పుస్తకాలు, పెన్నులు,పెన్సిల్లు, బహుమతిగా అందించిన కాంగ్రెస్ నేతలకు ,కార్యకర్తలకు, మేడిపల్లి ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయ భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

ఆలయం ప్రాంగణంలో ఉన్న పుష్కరిణి (గుండం) పరిశీలించిన జిల్లా ఎస్పీ



యాదగిరిగుట్ట,
అక్టోబర్ 26 (ప్రజా కలం)

ఆలయానికి వచ్చే భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత,సీసీ కెమెరాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి అని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రతపై ఆలయ ఈఓ, ఎస్పీఎఫ్ అధికారులతో కలిసి ఈఓ కార్యాలయంలో సోమవారం రోజున సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల భద్రత,నేరాల నివారణ,భద్రతా ఏర్పాట్ల పటిష్టతపై అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ఎస్పీ యాదగిరిగుట్టలోని కల్యాణకట్ట,పుష్కరిణి (గుండం) ప్రాంతాలను సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి,అన్ని కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు,నిరంతర నిఘా, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పర్యవేక్షణ, భద్రతా తనిఖీలను మరింత పటిష్టం చేయాలని సూచించారు.

ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్,ఎస్పీఎఫ్, ఆలయ అధికారుల మధ్య సమన్వయంతో పనిచేయాలని, నేరాల నివారణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఈఓ భవానీ శంకర్,యాదాద్రి డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు,ఎస్పీఎఫ్ ఆర్ఐ శేషగిరి రావు,సీఐ శంకర్, ఆర్ఐ శ్రీనివాస్,ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం

"అసెజ్ వావో" సంస్థ కృషి అభినందనీయం:ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బ్లూ ఓసియన్ ప్రాజెక్ట్ లో 132 – జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డ చెరువు సుందరీకరణ పనులను చేపడుతున్న "అసెజ్ వావో" సంస్థ ప్రతినిధులు సోమవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బ్లూ ఓసియన్ ప్రాజెక్ట్ లో భాగంగా చెరువుల సుందరీకరణతో పాటుగా పర్యావరణ పరిరక్షణకై చేపడుతున్న చర్యలను ఎమ్మెల్యే కి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... జీవ మనుగడతోనే మానవ మనుగడ సాధ్యమని, పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరమని, చెరువులకు పూర్వ వైభవం తెచ్చేలా "అసెజ్ వావో" సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో జెస్సీ తెలంగాణ సంస్థ ప్రతినిధులు కృపాకర్, ఆశిష్, మహేంద్ర, శిరీష, రోషిణి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 279 డివిజన్ రోదమేస్త్రినగర్ లోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు మొహమ్మద్ అజమ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన వారిని సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఫైమిదే బేగం, కౌటీ, అఫ్రీన్ బేగం, యస్సామీన్ బేగం, ఫాతిమాబేగం, రుబీనా బేగం, రుఖ్యా బేగం, సాజీదబేగం, కాయుఙ్జిసా, ఫోజియా బేగం, షైక్ షానవాజ్, షైక్ యూసఫ్, సైద్ మాసురన్, షేక్ ఫిరోజ్, మహమ్మద్ అజాం, మహమ్మద్ తౌఫిక్, మహమ్మద్ సాబేర్, మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ జునైద్, మహమ్మద్ మజహర్, సైద్ బహుద్దీన్ లను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ గణేష్, డివిజన్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మహిళా కోఆర్డినేటర్ సెక్రటరీ ఫారిన్ ఖాన్, డీసీసీ మైనారిటీ జనరల్ సెక్రటరీ షఫీ, అజార్, షరీఫ్, షైక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి లేని ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం.

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు కలెక్టరేట్ వరకు వెళ్లడం కష్టం కాబట్టి స్థానిక మండల రెవెన్యూ అధికార కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించి నెలలు గడుస్తున్నా కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికార కార్యాలయంలో ప్రజావాణి నేటి వరకు నిర్వహించకపోవడం అధికారులు ప్రభుత్వ ఆదేశాలను ఉల్లగించడం కిందకే వస్తుందని దాని ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తుందని జిల్లా కలెక్టర్ బాధ్యతలు తీసుకొని ప్రజావాణి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, జనసేన అధికార ప్రతినిధి సతీష్ సోమవారం కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికార కార్యాలయం ఎదురుగా మాట్లాడారు. జగద్గిరిగుట్ట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూముల చుట్టూ సర్వే నిర్వహించి ఫెన్సింగ్ నిర్వహించాలని హై కోర్టు తీర్పు ఇచ్చి సమయం గడిచిపోయిన రెవెన్యూ అధికారులు ఇంకా చెయ్యకుండా తాత్సారం చేయవద్దని వెంటనే సర్వే నిర్వహించి ఫెన్సింగ్ చెయ్యాలని కోరుతూ సోమవారం ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. సుమారు 11 గంటలు అయ్యిన అధికారులు రాకపోవడం, ప్రజావాణి నిర్వహించకపోవడం దారుణమని, అధికారులు ప్రజలు ఇచ్చిన వినతిపత్రంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన తర్వాత అనేక ఆలయాలు వెలిశాయి, అనేక స్థలాలు లక్షలకు అమ్ముడుపోయి, ఇండ్లు కూడా కట్టుకున్నారని ఇది స్పష్టంగా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందని ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి హైకోర్టు ఆదేశాలను అమలు చెయ్యాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు రుంకు సాయికృష్ణ, వేముల రాజు, కార్తీక్ లు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

- మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి సురేఖ

- జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్

గజ్వేల్:26 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్:మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా ఇన్‌చార్జి సురేఖ,జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నత్తి శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..



మహర్షి వాల్మీకి కేవలం ఒక మహర్షి మాత్రమే కాదని, గొప్ప ఆలోచనలకు,పరివర్తనకు,స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు.భారతీయ సాహిత్యంలో ఆదికవిగా గౌరవించబడే వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి,ధర్మం,నైతిక విలువలకు మార్గదర్శకంగా నిలుస్తోందని కొనియాడారు. రామాయణం కేవలం శ్రీరాముని జీవిత కథ మాత్రమే కాదని,జీవితంలో ఎలా నడుచుకోవాలి,కష్టాలను ఎలా ఎదుర్కోవాలి,ధర్మం కోసం ఎలా నిలబడాలి,సమాజం పట్ల బాధ్యతలను ఎలా నిర్వర్తించాలి అనే విలువైన విషయాలను బోధించే మహాకావ్యమని వివరించారు. మహర్షి వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని,మనిషి గతం కంటే అతనిలో వచ్చే పరివర్తన,ఆలోచనలు, ఆచరణ ముఖ్యమని ఈ సందర్భంగా చంటి ప్రభు పేర్కొన్నారు.ముఖ్యంగా యువత వాల్మీకి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్య, నైతిక విలువలు,సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యతనిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, పంజాల అశోక్ గౌడ్,నాలుగో వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్,జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకటరెడ్డి, మన్నె శేఖర్,జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరి రాజు, పట్టణ,మండల ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్,ఇప్ప స్వామి,జిల్లా నాయకుడు పెండ్యాల శ్రీనివాస్,ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగు ముదిరాజ్,మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు కుంకుమ రాణి,జిల్లా ఉపాధ్యక్షురాలు ఆలేటి సుమతి,పట్టణ ఉపాధ్యక్షురాలు చెన్నోజి నీరజ,బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి,శ్రీనివాస్,సంగేపు అనిల్, అనిల్ బజరంగ్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయంలో మహిళ ఆత్మహత్యాయత్నం. కేసు నమోదు

- అధికారులను బెదిరించే ఉద్దేశంతోనే చర్యకు పాల్పడిందన్న పోలీసులు

- గతంలోనూ పలు కేసులు నమోదైనట్లు ఏసీపీ నరసింహులు వెల్లడి

గజ్వేల్, అక్టోబర్ 26 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్ ఏసీపీ కార్యాలయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఏసీపీ నరసింహులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం సయ్యద్‌నగర్ గ్రామానికి చెందిన సయ్యద్ బేగం బీ (37) సోమవారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటలకు ఏసీపీని కలిసేందుకు కార్యాలయానికి వచ్చారు.ఆ సమయంలో ఇతర సందర్శకులు ఉండటంతో కొద్దిసేపు వేచి ఉండాలని, వెయిటింగ్ హాల్‌లో కూర్చోవాలని అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డు అందోల్ రాజు సూచించారు. అయితే,తన వెంట తెచ్చుకున్న ఎలుకల మందును నోట్లో వేసుకుని ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు హోంగార్డు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.వెంటనే అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తూ,అధికారులను, సిబ్బందిని భయాందోళనలకు గురిచేసే ఉద్దేశంతో ఆమె ఈ చర్యకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.



గతంలోనూ పలు కేసులు

సయ్యద్ బేగం బీ గతంలో తన భర్తపై నమోదైన కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులను బెదిరించే క్రమంలో రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అలాగే, చట్టవిరుద్ధంగా మద్యం విక్రయించారనే ఆరోపణపై ఆమెపై ఎక్సైజ్ కేసు నమోదైందని, ఇరుగుపొరుగు వారితో వివాదాలకు సంబంధించి నాలుగు న్యూసెన్స్ కేసులు కూడా ఉన్నాయని ఏసీపీ నరసింహులు పేర్కొన్నారు.



ఎలుకల మందు తాగిన సయ్యద్ బేగం బీ



గజ్వేల్ అలయ్ బలయ్ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

కులమతాలకు అతీతంగా ఐక్యతను చాటిన దసరా ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్ అలయ్ బలయ్ కమిటీ సభ్యులు

గజ్వేల్, అక్టోబర్ 26 (ప్రజా కలం ప్రతినిధి):

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో తొలిసారిగా నిర్వహించిన అలయ్ బలయ్ దసరా ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావడం పట్ల గజ్వేల్ అలయ్ బలయ్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పొన్నాల కుమార్,నీరుడి స్వామి,బాకీ స్వామి, నంఘవు కన్న, కొడకండ్ల నర్సింలు,ఏల్లేశ్వరం మహేష్, బైరం శివకుమార్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ,ఓసీ వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యత, సోదరభావాన్ని చాటిచెప్పాలనే ఉద్దేశంతో ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు,అన్ని రాజకీయ పార్టీల నాయకులు,వివిధ కుల సంఘాల ప్రతినిధులు,మీడియా మిత్రులు, గజ్వేల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు.కులమత భేదాలను పక్కనపెట్టి పరస్పర సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజ ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు,వివిధ సంఘాల ప్రతినిధులు,మీడియా మిత్రులు, పట్టణ,నియోజకవర్గ ప్రజలకు కమిటీ తరఫున పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్ బకాయిలు చెల్లించకపోతే కఠిన చర్యలు

- సన్న బియ్యం రూపంలో బకాయిలు అందజేయాలి

- పెండింగ్ బియ్యాన్ని గడువులోగా డెలివరీ చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరిక



మెదక్ అక్టోబర్ 26 (ప్రజాకలం ప్రతినిధి)

సీఎంఆర్ బకాయిల చెల్లింపులు, పెండింగ్ బియ్యం డెలివరీల విషయంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించరాదని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా బకాయిలను చెల్లించకపోయినా, బియ్యం డెలివరీలను పూర్తి చేయకపోయినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రైస్ మిల్లుల యాజమాన్యాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కేఎంఎస్ 2014-15 నుంచి ఖరీఫ్ 2024-25 వరకు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బకాయిలను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సన్న బియ్యం రూపంలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. రబీ 2022-23 సీజన్‌కు సంబంధించిన వేలం వేసిన ధాన్యాన్ని ఇందుకు మినహాయించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సన్న బియ్యం అందజేయకుండా ధాన్యం విలువకు సమానమైన మొత్తాన్ని చెల్లించే సందర్భంలో నిర్దేశించిన 125 శాతం మొత్తంతో పాటు ఒప్పందం ప్రకారం 12 శాతం వడ్డీ, పెనాల్టీ కూడా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యానికి సంబంధించిన బకాయిలను తక్షణమే చెల్లించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న 45 రోజుల గడువులోగా సంబంధిత బకాయిలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రబీ 2024-25 సీజన్‌కు సంబంధించిన పెండింగ్ సీఎంఆర్ బియ్యంతో పాటు కేఎంఎస్ 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన బియ్యాన్ని నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిర్ణీత గడువులోగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు డెలివరీ చేయాలని ఆదేశించారు. బకాయిల చెల్లింపులు, బియ్యం సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకుండా మిల్లర్లు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించినా, సీఎంఆర్ బకాయిలను చెల్లించకపోయినా, నిర్ణీత గడువులోగా పెండింగ్ బియ్యం డెలివరీలను పూర్తి చేయకపోయినా సంబంధిత రైస్ మిల్లర్లపై నిబంధనల ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరించారు. ఇప్పటికే ప్రారంభించిన లేదా చేపట్టనున్న చట్టపరమైన చర్యలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానందం, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జగదీష్, ఇతర అధికారులు, జిల్లా రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

గజ్వేల్ 5వ వార్డులో అంబేద్కర్ భవన్‌కు శంకుస్థాపన

ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధికి భవనం దోహదం

గజ్వేల్--ప్రజ్ఞాపూర్, అక్టోబర్ 26 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డులో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.గతంలో మంజూరైన ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక (ఎస్సీ సబ్ ప్లాన్/ టీఎస్పీ) ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టనున్న ఈ భవన నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు,అధికారులు భూమిపూజ



చేసి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్,మున్సిపల్ కమిషనర్ పి.గణేష్ రెడ్డి,వైస్ చైర్‌పర్సన్ కళ్యాణకర్ పద్మబాయి నర్సింగరావు, ఐదవ వార్డు కౌన్సిలర్ మన్నె రూప వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్,కమిషనర్ మాట్లాడుతూ.అంబేద్కర్ భవన్ ఎస్సీ,ఎస్టీ వర్గాల సామాజిక, సాంస్కృతిక,విద్యాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేస్తూ వార్డులో మౌలిక వసతుల కల్పనకు,ప్రజల సంక్షేమానికి పాలకవర్గం,మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు.భవన నిర్మాణ పనులను వేగంగా చేపట్టి,నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్,కమిషనర్ పి.గణేష్ రెడ్డి,వైస్ చైర్‌పర్సన్ కళ్యాణకర్ పద్మబాయి నర్సింగరావు, ఐదవ వార్డు కౌన్సిలర్ మన్నె రూప వెంకటేష్‌తో పాటు స్థానిక వార్డు నాయకులు,వివిధ కుల సంఘాల ప్రతినిధులు,మున్సిపల్ సిబ్బంది,వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డేపల్లిలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడాలి.

గజ్వేల్ ఏసీపీ కార్యాలయంలో మహిళ ఆత్మహత్యాయత్నం.. కేసు నమోదు.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 26.

గజ్వేల్ ఏసీపీ కార్యాలయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సయ్యద్ బేగం బీ (37)పై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ నరసింహులు తెలిపారు. రాయపోల్ మండలం సయ్యద్ నగర్‌కు చెందిన ఆమె సోమవారం ఏసీపీని కలిసేందుకు కార్యాలయానికి వచ్చారు. అధికారులు ఇతరులతో మాట్లాడుతున్నందున వేచి ఉండాలని హోంగార్డు సూచించడంతో, తన వెంట తెచ్చుకున్న ఎలుకల మందును తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వెంటనే సిబ్బంది ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలోనూ రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు, ఆమెపై అక్రమ మద్యం విక్రయానికి సంబంధించి ఒక కేసుతో పాటు, ఇరుగుపొరుగు వారితో గొడవలకు సంబంధించి నాలుగు న్యూసెన్స్ కేసులు నమోదైనట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రజాపాలనను అపహాస్యం చేసే అధికారులపై సీఎంకు ఫిర్యాదు చేస్తాం

ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారుల తీరును సహించేది లేదు

చిన్మయి మార్గ్‌లో ఇంకుడు గుంత ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి: జంగాల శ్రీరామ్ యాదవ్

మల్కాజిగిరి, అక్టోబరు 26 (ప్రజా కలం ప్రతినిధి):

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజాపాలనకు చెడ్డపేరు తీసుకువచ్చే అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు జంగాల శ్రీరామ్ యాదవ్ హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమస్యలకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

మల్కాజిగిరి జోనల్ పరిధిలోని మల్కాజిగిరి--మిర్జాలగూడ డివిజన్ చిన్మయి మార్గ్‌లో ప్రజా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని మూడు వారాల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రతి వారం ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని పరిశీలించిన మల్కాజిగిరి జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీ చేసి, అక్రమ నిర్మాణాన్ని తొలగించి ఇంకుడు గుంతను యథావిధిగా కొనసాగించాలని సూచించినట్లు శ్రీరామ్ యాదవ్ తెలిపారు. అయినప్పటికీ ఆదేశాలు అమలు కాకపోవడంపై ప్రజావాణిలో అధికారులను నిలదీసినట్లు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమానికి ఉపయోగపడే ఇంకుడు గుంతలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, వాటిని ఆక్రమణలకు గురిచేస్తే భవిష్యత్తులో మరిన్ని ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని, ఇంకుడు గుంతను కాపాడాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించే అధికారుల వ్యవహారశైలిని ఉపేక్షించబోమని, అవసరమైతే స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రికి నేరుగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకులతో కుమ్మక్కై ప్రజా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించిన ఆయన, ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మైనంపల్లి హనుమంతరావు సహకారంతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని జంగాల శ్రీరామ్ యాదవ్ స్పష్టం చేశారు.



కేటీఆర్‌ను కలిసిన జీఎంఆర్..

- సందీప్ రెడ్డి నిశ్చితార్థానికి కేటీఆర్‌కు ఆహ్వానం..

పటాన్‌చేరు, అక్టోబర్ 26 (ప్రజా కలం) ప్రతినిధి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు కేటీఆర్ ను పటాన్‌చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన కుటుంబంలో జరగనున్న శుభకార్యానికి హాజరుకావాలని కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు గూడెం సందీప్ రెడ్డి నిశ్చితార్థ వేడుకకు విచ్చేసి వేడుకను మరింత ప్రత్యేకంగా చేయాలని మహిపాల్ రెడ్డి కోరారు. కుటుంబ వేడుకకు సంబంధించిన ఆహ్వానాన్ని కేటీఆర్‌కు అందజేసిన అనంతరం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కుటుంబ వేడుకకు ఆహ్వానించడం రాజకీయ వర్గాల్లోనూ ప్రాధాన్యత సంతరించుకుంది..





అమీర్‌పేట్ లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుని గృహప్రవేశానికి హాజరైన మాజీ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరి అక్టోబర్ 26, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడు గాజుల కవిత ఆనంద్ నూతన గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ తీగల అనితా రెడ్డి విచ్చేసి, నూతన గృహంలోకి ప్రవేశించిన కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతుందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోల మల్లేష్ యాదవ్, ఆవుల యాదయ్య,మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వర్కల యాదగిరి గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మస్సన్‌పల్లి వెంకటేష్ గౌడ్ అమీర్‌పేట్ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు ఎర్ర చంద్రమోహన్, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్ మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర శంకరయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లెనిన్ నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

- రోడ్లపైకి ప్రవహిస్తున్న మురుగునీరు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

- స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్న సబితమ్మ

మహేశ్వరం, అక్టోబర్ 26 (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్, ప్రశాంతి హిల్స్ డివిజన్ పరిధిలోని మీర్‌పేట్ లెనిన్ నగర్ లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. మీర్‌పేట్ లెనిన్ నగర్, ప్రశాంతి నగర్, ప్రశాంతి నగర్ ఫేజ్-2, ఎం.కె. నగర్, బి.కె. నగర్ తదితర ప్రాంతాల్లో కాలనీవాసులను ఆప్యాయంగా పలకరించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లపైకి మురుగునీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని, మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో నిత్యావసరాలకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్థానికులు వివరించిన సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గారు సంబంధిత అధికారులను అక్కడికక్కడే పిలిపించి మాట్లాడారు. రోడ్లపైకి మురుగునీరు రాకుండా డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని, పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా మంచినీటి సరఫరాలో ఉన్న ఇబ్బందులను గుర్తించి, ప్రజలకు సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు, పరిసర గ్రామాల్లో వెలగని వీధిలైట్లు

-చీకట్లో ఆర్ అండ్ ఆర్ కాలనీలు,గ్రామాలు..


-రాత్రివేళ ప్రయాణికులకు ఇబ్బందులు

-ప్రమాదాలపై స్థానికుల ఆందోళన.

-వీధిలైట్ల మరమ్మతులకు డిమాండ్

గజ్వేల్, అక్టోబర్ 26 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలతో పాటు ఎర్రవల్లి,సింగారం,వేములఘట్ గ్రామాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానికులు,ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ముట్రాజ్‌పల్లి రోడ్డు నుంచి ప్రధాన రహదారి మీదుగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీల గుండా గౌరారం వరకు వెళ్లే మార్గంలో వీధిలైట్లు పనిచేయక పోవడంతో రాత్రివేళ రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.గత కొన్ని రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం కాగానే రహదారులన్నీ చీకటిమయంగా మారుతున్నాయని,ప్రధాన రహదారి నుంచి కాలనీలకు వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని చెబుతున్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రహదారిపై ఉన్న గుంతలను గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. కాలినడకన వెళ్లే మహిళలు,వృద్ధులు, చిన్నపిల్లలు చీకట్లో ప్రయాణించేందుకు భయపడుతున్నారు.వీధిలైట్లు పనిచేయకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందని,పాములు,ఇతర విషపూరిత జీవుల సంచారంతోనూ ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముట్రాజ్‌పల్లి రోడ్డు నుంచి ఆర్‌అండ్‌ఆర్ కాలనీల మీదుగా గౌరారం వెళ్లే ప్రధాన మార్గంతో పాటు ఎర్రవల్లి,సింగారం,వేములఘట్ గ్రామాల్లో వీధిలైట్ల సమస్యను సంబంధిత అధికారులు తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. పనిచేయని వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టి,రాత్రివేళ రహదారులపై తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలు,ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.



మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉచిత కుట్టు శిక్షణ

40 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు

గజ్వేల్, అక్టోబర్ 26 (ప్రజా కలం ప్రతినిధి):

మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వృత్తి నైపుణ్య శిక్షణలు ఎంతగానో దోహదపడతాయని గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు అన్నారు. జల్ జీవన్,ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని 4వ వార్డులో 45 రోజులపాటు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.కుట్టు శిక్షణ ద్వారా మహిళలు ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందుతూ గౌరవప్రదమైన జీవనాన్ని సాగించవచ్చని తెలిపారు.మహిళలకు ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తున్న జల్ జీవన్,ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీల సేవలను అభినందించారు.శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని మహిళలకు సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ అనురాధ (వెంకటలక్ష్మి) శిక్షకురాలిగా వ్యవహరించి మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు రొట్టెల శ్రీనివాస్,మన్నె రూప వెంకటేష్,జల్ జీవన్,ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు,శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం వాటర్ ట్యాంకుల స్థలాన్ని కాపాడాలి

బీజేపీ మహేశ్వరం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రజావాణిలో నిరసన

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్





మహేశ్వరం, అక్టోబర్ 26, (ప్రజా కలం)

గత మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ వివాదంపై బీజేపీ ఇచ్చిన ఫిర్యాదుకు 15 రోజులుగా స్పందన లేకపోవడంతో నిరసన చేపట్టారు. వాటర్ ట్యాంకుల స్థలానికి సంబంధించిన ప్రహరీ గోడపై కబ్రస్తాన్ అని రాసిన వారిని గుర్తించి, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజలకు తాగునీరు అందించే వాటర్ ట్యాంకులను, వాటి స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత గ్రామ సర్పంచ్‌పై కూడా ఉందని, ఈ విషయంలో సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సర్వే నంబర్ 336కు సంబంధించిన పత్రాలు, హద్దులను పరిశీలించి సమస్యను చట్టప్రకారం పరిష్కరించాలని అధికారులను కోరగా, ఎంఆర్ఓ రేపటిలోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.ఈ కార్యక్రమం బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్ ఆధ్వర్యంలో జరిగింది.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి పాండు నాయక్, సీనియర్ నాయకులు తింగరికారి నాగేశ్వర్ ప్రకాష్, ఆదిల్ల కుశలయ్య, మండల కార్యదర్శి మహేందర్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు చిందం జంగయ్య, రామోజీ, బొమ్మని జంగయ్య, శ్రీశైలం యాదవ్, దూసకంటి సాయినాథ్, భూత్ అధ్యక్షుడు దూసకంటి గణేష్, గాజుల శేఖర్, భీమనపల్లి రాజేష్, సందుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బైలంపూర్‌లో విద్యార్థులకు యూనిఫాంలు, షూస్ పంపిణీ

విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు: సర్పంచ్ మచ్చల కృష్ణ

గజ్వేల్ నియోజకవర్గం, అక్టోబర్ 26 (ప్రజా కలం ప్రతినిధి)

ములుగు మండలంలోని బైలంపూర్ గ్రామ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం యూనిఫాంలు,షూస్ పంపిణీ



చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మచ్చల కృష్ణ హాజరై విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మచ్చల కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమని,ఈ దశలో క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని,ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి ఆధ్వర్యంలో సర్పంచ్ మచ్చల కృష్ణను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితాదేవి, వార్డు సభ్యుడు నాగరాజు, ఉపాధ్యాయులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో ఉచిత మెగా వైద్య శిబిరం!

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ప్రజారోగ్యానికి పెద్దపీట



మహేశ్వరం, అక్టోబర్ 26 (ప్రజా కలం)

పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులపాటు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఆర్ఎక్స్‌పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా ప్రజలకు అవసరమైన ఆధునిక వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఎస్ఎచ్ఓ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం ఫ్యూచర్ సిటీ డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకిరెడ్డి సహకారంతో ఈ ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. శిబిరంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు:

బ్లడ్ ప్రెజర్, హార్ట్ రేట్, ఈసీజీ, బ్రీత్ రేట్, ఎస్‌పీఓ2, బాడీ టెంపరేచర్, బ్లడ్ గ్లూకోజ్ పరీక్షలతో పాటు పోర్టబుల్ ఎక్స్‌రే, హెచ్ఆర్‌వీ వంటి ఆధునిక వైద్య సేవలను అందుబాటులో ఉంచినట్లు ఎస్ఎచ్ఓ తెలిపారు.ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు ముందుకొచ్చిన ఆర్ఎక్స్‌పర్ట్ సూపర్ స్పెషాలిటీ ఈ-క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పట్నాయక్‌తో పాటు ఆయన బృందాన్ని ఎస్ఎచ్ఓ రాఘవేందర్ రెడ్డి అభినందించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వారం రోజులపాటు ప్రతిరోజూ ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్ఎచ్ఓ వెల్లడించారు. ఇందులో భాగంగా బైక్ ర్యాలీలు, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

అలాగే ఈ నెల 30న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మారయ్య, ప్రసాద్, ధనుంజయ్, ఏఎస్ఐలు శ్రీనివాస్ రెడ్డి, రాంలాల్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





రెండోసారి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన రవికి శుభాకాంక్షలు.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 26.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన రవికి వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ రేణుకా రాజగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవిని అభినందించి, ఆయన నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు శివ, మండల కోశాధికారి రవి, సీఆర్పీ యాదగిరి, ఎఫ్ఏ స్వామి, నర్సింలు, స్వామి, గోపి, రమేష్, మల్లేష్, లక్ష్మణ్, ఆంజనేయులు, రాజు, సంతోష్, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొని రవికి శుభాకాంక్షలు తెలిపారు.



చైత్యభూమి సాక్షిగా సాహిల్ కోసం న్యాయ పోరాటంలో తెలుగోళ్ళు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 26:

ఐఐటి విద్యార్థి సాహిల్ వాకోడే సంస్థాగత హత్యకు నిరసనగా ఆదివారం సాయంత్రం ముంబైలోని చైత్యభూమి వద్ద క్యాండెల్ మార్చ్ పలు సంఘాలు నిర్వహించాయి. అందులో తెలుగువారి టీం పాల్గొని సంఘీభావం తెల్పారు. అయితే పోలీసులు క్యాండెల్ మార్చ్ ఆరంభం కాక ముందే అనేక విద్యార్థులను డిటైన్ చేశారు. ఐఐటి డీన్ సూర్యనారాయణ డూళ్ళాను, డైరెక్టర్ శిరీష్ కేదారెను సస్పెండ్ చేయాలి, సాహిల్ కు న్యాయం జరగాలి, విద్యా సంస్థలలో కుల వివక్షను అంతం చేయాలనేవి వారి ముఖ్యమైన డిమాండ్లు. అరెస్టులకు విద్యార్థి లోకం అసలకే జంకలేదు. డిటైనైన వందల మంది ఆందోళనకారులు శివాజీ పార్క్, వర్లీ పోలీస్ స్టేషన్లో నే క్యాండెల్ వెలగించి నినాదించారు. అయితే మంటలు ఆరిపోవచ్చు, కానీ న్యాయం కోసం పోరాటం ఆగదు అంటున్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు రాష్ట్ర ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండించారు. క్యాండెల్ వెలగించిన వారు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నాగసేన్ మాలజీ, పాయల్ ఖరే, జంగం లింగోజీ, బాంసెఫ్ నేత మాక్వానా, ఎంటిబిఎఫ్ నాయకులు రమేష్ చౌవల్, ప్రభు కొరగోని, సింగపాక సురేష్, అలివేలు యాకారి, తోగారి రాధ, సోని, భీంరత్న మాలజీ, ఎం. మాలజీ పాల్గొని సాహిల్ కు నివాళి అర్పించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

-బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

- స్మార్ట్‌ఫోన్లను దూరం పెట్టి.. క్రీడా మైదానాల వైపు విద్యార్థులను నడిపించండి

-పాఠశాల భవనాలు, మౌలిక వసతుల బిల్లులను తక్షణమే విడుదల చేయాలి: ప్రభుత్వానికి డిమాండ్

-పెండింగ్ బిల్లుల విడుదల కోసం అసెంబ్లీలో మరోసారి గళమెత్తుతాం

-మెండోరా మండల 70e SGF అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను ప్రారంభించిన మాజీ మంత్రి





నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 26:

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను తమ జీవితంలో అంతర్భాగం చేసుకోవాలని, నిత్యం ఆటలాడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందుతుందని బాల్కొండ శాసనసభ్యులు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాంగణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెండోరా మండల స్థాయి 70వ అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను (అండర్-14, అండర్-17 విభాగాల్లో) సోమవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి, విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. మార్చ్ ఫాస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన పాఠశాలలకు బహుమతులు అందజేశారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

గత ప్రభుత్వ హయాంలో మెండోరా మండల పరిధిలోని పాఠశాలలకు మంజూరైన నూతన భవనాలు, అదనపు గదుల నిర్మాణ పనులు నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. 'మన ఊరు - మన బడి' పథకం కింద చేపట్టిన కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడలు, టాయిలెట్ల నిర్మాణాలకు సైతం బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై తాను ఇప్పటికే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీశానని, నియోజకవర్గంలోని పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మరోమారు ఆర్థిక శాఖ మంత్రిని స్వయంగా కలిసి ఒత్తిడి తెస్తానని స్పష్టం చేశారు.

దాతల సహకారంతో మౌలిక వసతుల కల్పన

మండల విద్యాశాఖ అధికారి కోరిన మేరకు పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన డ్యూయల్ డెస్క్ బల్లల కొరతను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. తమ కుటుంబ వియ్యంకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త దయానందరెడ్డి ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛందంగా డ్యూయల్ డెస్కులు, కంప్యూటర్లు సమకూర్చారని ప్రస్తావించారు. అలాగే చాకిర్యాల్ పాఠశాలలో అవసరమైన వసతుల కోసం స్థానిక సర్పంచ్ చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ.. దయానందరెడ్డి సహకారంతో తగిన వసతులు సమకూర్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచండి

నేటి సాంకేతిక యుగంలో విద్యార్థులు టీవీలు, స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్లకు బానిసలై మైదానాలకు దూరమవ్వడం ఆందోళన కలిగిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రతిరోజూ సాయంత్రం కనీసం గంటపాటు మైదానంలో ఏదో ఒక ఆట ఆడేలా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఆటల ద్వారానే జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకునే స్పోర్ట్స్‌మ్యాన్ స్పిరిట్ అలవడుతుందని, డిప్రెషన్‌లకు గురికాకుండా స్థిరచిత్తంతో ముందుకు సాగడానికి క్రీడలు దోహదపడతాయని హితవు పలికారు.

క్రీడా నేపథ్యం ఉన్న కుటుంబం

తన తండ్రి నేషనల్, యూనివర్సిటీ వాలీబాల్ క్రీడాకారుడని, తాను కూడా జూనియర్ నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడినని, తన సోదరుడు, సోదరి కూడా క్రీడల్లో రాణించారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేసుకున్నారు. బాల్కొండ నియోజకవర్గాన్ని క్రీడారంగంలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సంపూర్ణంగా సహాయసహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. క్రీడల నిర్వహణలో మండల పీఈటీలు విద్యాసాగర్, రాజ్‌కుమార్, గంగాధర్, రమేష్, శ్రీనివాస్, ప్రభాకర్‌ల అంకితభావాన్ని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ధర్మపురి, పోచంపాడ్ సర్పంచ్ మాధురి రాజు, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మణ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజావాణికి 39 ఫిర్యాదులు

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 26:

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో బాధితుల నుంచి మొత్తం 39 ఫిర్యాదులను నిజామాబాద్



పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్., స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అర్జీదారుల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన వెంటనే సీపీ సానుకూలంగా స్పందించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా, చట్టపరిధిలో వీటికి తక్షణమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.


ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి పైరవీలు, దళారుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. చట్టప్రకారం తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి పోలీసులకు సహకరించాలన్నారు. ప్రజలకు పోలీసులు మరింత జవాబుదారీగా ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా జిల్లా పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా బాధితుల సమస్యలను నేరుగా స్వీకరించి, త్వరితగతిన పరిష్కరిస్తామని సీపీ వివరించారు.

అమీర్ పేట్ లో కాంగ్రెస్ నేత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జెడ్పీ చైర్మన్ తీగల అనితారెడ్డి

కేజీ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి మృతి పట్ల నివాళి

మహేశ్వరం, అక్టోబర్ 26 (ప్రజా కలం)


మహేశ్వరం మండలం అమీర్ పేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేజీ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి మృతి చెందిన విషయం తెలిసి మాజీ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ తీగల అనితా రెడ్డి వారి నివాసానికి వెళ్లి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి ధైర్యం చెప్పారు. విజయలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఆవుల యాదయ్య, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్, అమీర్ పేట్ గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు నింగోల బాలరాజు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ చొరవతో ప్రసవ సేవలకు ఊపిరి

మోర్తాడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు పునఃప్రారంభం

నిరంతరాయంగా సేవలు అందించాలని ప్రజల విజ్ఞప్తి



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 26:

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవ సేవలకు మళ్లీ ఊపిరి పోసుకుంది. సోమవారం ఆసుపత్రిలో ఒక గర్భిణికి విజయవంతంగా నార్మల్ డెలివరీ నిర్వహించడంతో స్థానిక ప్రజలు, బాధితుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలతో పాటు అత్యవసర సమయాల్లో సిజేరియన్ ఆపరేషన్లు కూడా విజయవంతంగా జరిగేవి. అయితే, కొంతకాలంగా ఇక్కడ ప్రసవ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో స్థానిక గర్భిణులు ప్రసవం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో వారు తీవ్ర ఆర్థిక, శారీరక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈ సమస్యపై స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఆసుపత్రిలో ప్రసవ సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి.

వసతులు ఉన్నాయి..

సిబ్బందిని నియమించండి:

మోర్తాడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో విశాలమైన గదులు, అవసరమైన మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కలెక్టర్ చొరవతో మళ్లీ ప్రారంభమైన ఈ ప్రసవ సేవలను కేవలం ఒక రోజుతో ముగించకుండా, నిరంతరాయంగా కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రికి తగిన సంఖ్యలో వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని నియమించి, సాధారణ ప్రసవాలతో పాటు సిజేరియన్ సేవలను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని మోర్తాడ్ మండల ప్రజలు జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోవాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నరేందర్ నాయక్

మహేశ్వరం, అక్టోబర్ 26, (ప్రజా కలం)

మహబూబ్‌నగర్--హైదరాబాద్--రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ తనయుడు మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నరేందర్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా నరేందర్ నాయక్ మాట్లాడుతూ, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ, మీడియా ప్రతినిధులు సైతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలతో ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, తమతో పాటు ఇతర అర్హులైన పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.




మహబూబ్‌నగర్--హైదరాబాద్--రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యబద్ధంగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలని నరేందర్ నాయక్ అన్నారు.అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవడంతో పాటు ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్ రాంచంద్రరావుని కలిసిన రంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్

మహేశ్వర అక్టోబర్ 26 (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పోతర్ల సుదర్శన్ యాదవ్ నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచంద్రరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ ముఖ్యమైన బాధ్యతను అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచంద్రరావుకి హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి,ఓబీసీ వర్గాల అభ్యున్నతికి కృషి [illegible] పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన [illegible] కార్యదర్శి మునావత్ పాండు నాయక్, బీజేపీ మ[illegible]



[illegible] మీడియా కన్వీనర్ మోతే యాదయ్య, మండల కిసాన్ [illegible]పాధ్యక్షులు చిందం జంగయ్య,సీనియర్ నాయకులు [illegible]రేష్,యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఐక్యతను చాటుదాం



- నవంబరు 1న నిజామాబాద్‌లో ఆది జాంబవంతుని శోభాయాత్ర
- మాదిగ జాగృతి సంఘం జిల్లా నాయకుడు
- నాగేశ్వర్‌రావు మహారాజ్ పిలుపు



నిజామాబాద్, అక్టోబరు 26: (ప్రజా కలం ప్రతినిధి)

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నవంబరు 1వ తేదీ (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న 'మాదిగ మహారాజుల ఆది జాంబవంతుని శోభాయాత్ర'ను విజయవంతం చేయాలని మాదిగ జాగృతి సంఘం జిల్లా నాయకుడు నాగేశ్వర్‌రావు మహారాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ విశారదన్ మహారాజ్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.ఆది జాంబవంతుడు మాదిగ సమాజ చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని కొనియాడారు. ఆయన గొప్పతనాన్ని, సామాజిక ఐక్యతను చాటిచెప్పేలా జిల్లాలోని అన్ని మండలాల నుంచి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శోభాయాత్రకు ఘనత తీసుకురావాలని కోరారు. పార్టీలు, మతాలు, వ్యక్తిగత విభేదాలకు అతీతంగా మాదిగ సమాజం అంతా ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. భేదాలను పక్కనపెట్టి ఆత్మగౌరవం, సామాజిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. శోభాయాత్రలో యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని నాగేశ్వర్‌రావు మహారాజ్ విజ్ఞప్తి చేశారు.

పేరేడు భూములపై 'పట్టా' పంచాయతీ

- గ్రామకంఠం కాదు.. ప్రభుత్వ, దేవాదాయ భూమి అంతకన్నా కాదు
- పాత రికార్డులు, కోర్టు ఉత్తర్వులు ఉన్నాయంటున్న సర్పంచ్ నవీన్, చంద్రయ్య
- ఆరోపణలు నిరూపించాలి.. బహిరంగ చర్చకు సిద్ధం
- అధికారుల సర్వేతో వాస్తవాలు తేల్చాలని డిమాండ్



మహేశ్వరం, అక్టోబరు 26 (ప్రజా కలం): మహేశ్వరం పరిధిలోని పేరేడు 1, 2లో ఉన్న 4.06 గుంటల భూమిపై వివాదం ముదురుతోంది. ఆ భూమి గ్రామకంఠం, ప్రభుత్వ లేదా దేవాదాయ భూమి కాదని.. పట్టా భూమేనని గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య స్పష్టం చేశారు.

భూమికి సంబంధించిన పాత పత్రాలు, రెవెన్యూ రికార్డులు, కోర్టు ఉత్తర్వులు, ఒప్పంద పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు కాకి ఈశ్వర్ చేసిన ఆరోపణలు వాస్తవం కాదని పేర్కొన్నారు.

1950 నుంచి పట్టా భూమిగానే..

పేరేడు 1, 2లోని భూమి 1950 నుంచి పట్టా భూమిగానే రికార్డుల్లో ఉందని సర్పంచ్ నవీన్ తెలిపారు. అప్పటి దేవాలయ కమిటీతో జరిగిన ఒప్పందాల ఆధారంగానే భూమికి సంబంధించిన లావాదేవీలు జరిగాయని చెప్పారు. భూమి స్వరూపంపై స్పష్టత కోసం పది రోజుల క్రితమే మహేశ్వరం తహశీల్దార్‌కు సర్వే చేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు వెల్లడించారు. ఇదే లేఅవుట్‌లో 2004లో తన భార్య పేరుతో ప్లాటు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

1991లో లేఅవుట్.. 1998లో తీర్పు

చంద్రయ్య మాట్లాడుతూ.. 1950 నుంచి భూమి పట్టా భూమిగానే పత్రాల్లో నమోదై ఉందన్నారు. 1991లో సయ్యద్ హస్నోద్దీన్ ఆధ్వర్యంలో లేఅవుట్ ఏర్పాటు కాగా, అదే ఏడాది గ్రామపంచాయతీ నుంచి ఎన్‌వోసీ పొందినట్లు పేర్కొన్నారు.

1992లో లేఅవుట్‌కు సంబంధించి న్యాయస్థానంలో కేసు నమోదైందని, 1998లో ఇబ్రహీంపట్నం కోర్టు తమ వాదనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు.

దేవాలయ భూమిగా పేర్కొనేందుకు తగిన ఆధారాలు లేవని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు చంద్రయ్య వివరించారు. పేరేడు 1, 2 భూములకు సంబంధించి సయ్యద్ సాదత్, సల్మాన్ షరీఫ్, అఫ్సన్ పట్టాదారులుగా ఉన్నారని తెలిపారు.

దేవస్థానం కమిటీతో ఒప్పందం

2002లో శివగంగా రాజరాజేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో లేఅవుట్‌లో ప్లాట్ల క్రయవిక్రయాలకు సంబంధించి ఒప్పందం జరిగినట్లు చంద్రయ్య తెలిపారు. అప్పటి సర్పంచ్ కూన యాదయ్య, దేవస్థానం కమిటీ చైర్మన్ కాకి ఈశ్వర్ ఈ భూమి గ్రామకంఠం, దేవాలయ భూమి కాదనే అంశంపై ఒప్పంద పత్రం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

పేరేడు 1, 2 భూములకు సంబంధించి టెనెంట్‌దారులుగా దోమ ఎల్లారెడ్డి, బజార్ (చాకలి) జంగయ్య పేర్లు ఉన్నాయని, 38-ఈ పత్రం కూడా జంగయ్య పేరుతో ఉందని తెలిపారు. 1996లో జంగయ్య తన టెనెన్సీ హక్కులను అసునుద్దీన్‌కు సరెండర్ చేసినట్లు పేర్కొన్నారు.

72 మంది పట్టాదారులు

ప్రస్తుతం ఈ లేఅవుట్‌లో 72 మంది పట్టాదారులు ఉన్నారని చంద్రయ్య తెలిపారు. తాను 2003లో ప్లాటు కొనుగోలు చేసినట్లు చెప్పారు. అప్పటి మార్కెట్ విలువకు అనుగుణంగానే క్రయవిక్రయాలు జరిగాయని, తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేశారన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ప్లాట్లు కొనుగోలు చేసిన వలువురు పట్టాదారులు సైతం విలేకరుల సమావేశంలో తమ సమస్యలను వివరించారు. 2013లో రఘునందన్‌రావు తహశీల్దార్ ఉత్తర్వులు జారీ చేసిన అంశాన్ని కూడా వారు ప్రస్తావించారు.

'ఆధారాలతో రండి.. బహిరంగ చర్చకు సిద్ధం'

తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలతో ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని చంద్రయ్య ప్రకటించారు. ఆరోపణలు చేస్తున్నవారు కూడా ఆధారాలతో చర్చకు రావాలని సవాల్ విసిరారు.

పార్టీ అధికారంలో ఉందనే కారణంతో ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారిని భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు.

సర్వేతో వివాదానికి తెరదించాలి

పేరేడు 1, 2 భూములపై రాజకీయ కారణాలతో ఆరోపణలు, అసత్య ప్రచారం జరుగుతోందని చంద్రయ్య విమర్శించారు. భూమికి సంబంధించిన పాత పత్రాలు, రెవెన్యూ రికార్డులు, కోర్టు ఉత్తర్వులు, ఒప్పంద పత్రాలను పరిశీలించాలని అధికారులను కోరారు.

అధికారిక రికార్డుల ఆధారంగా సమగ్ర సర్వే నిర్వహించి భూమి స్వరూపం, హక్కులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వే నివేదికతో వివాదానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఇసాక్‌రెడ్డి, అజాంఅలీ, పాండురంగయ్య, వెంకటేశ్వర్లు, శ్రీహరి, శంకర్, యాదయ్య, కానాపురం సాగర్, ఒగ్గు మల్లేష్, చాకలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలి.

- యూనివర్సిటీ ఉన్నది చదువులకా లేక సినిమా ఈవెంట్లకా?
- సినిమా ప్రమోషన్ల కోసం విద్యార్థుల చదువులకు ఆటంకాలా?
- ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్

మేడ్చల్/మేడిపల్లి అక్టోబర్ 26(ప్రజాకలం న్యూస్)



మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో ఉన్న మల్లారెడ్డి యూనివర్సిటీ,మల్లారెడ్డి విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థుల చదువులతో ఆటలాడుతూ.. ఇటీవల యూనివర్సిటీలో విద్యార్థులకు చదువులకంటే ఎక్కువ సినిమా ఈవెంట్లను అర్ధరాత్రి వరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తూ.. చదువులో రాణించాలని చెప్పకుండా సినిమాలు చూడాలని విద్యార్థులకు కళాశాలకు సెలవు ఇవ్వడం అంటే దేనికి సంకేతం ఇస్తున్నారో తెలియజేయాలి. ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆయన సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లితండ్రులు ఫీజులు కట్టేది సినిమా ఈవెంట్లలో పాల్గొనడానికా ? లేక సినిమాలు చూడటానికా? అనే విషయం ఉన్నత విద్యాశాఖ , యూజీసీ అధికారులు చెప్పాలని, మల్లారెడ్డి యూనివర్సిటీలో అక్టోబర్ 23 న జరిగిన "ఆదర్శ కుటుంబం" ట్రైలర్ లాంచ్ లో సినిమా అక్టోబర్ 30న విడుదల సందర్భంగా విద్యార్థులందరూ సినిమా వీక్షించాలని కోరుతూ యూనివర్సిటీ యాజమాన్యం వారు యూనివర్సిటీకి సెలవు ప్రకటించడం ఎంత వరకు సమంజసమని అన్నారు.మల్లారెడ్డి యూనివర్సిటీలో విద్యాప్రమాణాలు మెరుగు పరచడం కంటే సినిమా ప్రమోషన్ల కోసం విద్యార్థులను సినిమా ఈవెంట్లకు బలిపెడుతున్నారని,మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యాసంస్థ కాకుండా సినిమా ఈవెంట్ల హబ్ గా మార్చారని వెంటనే విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మల్లారెడ్డి యూనివర్సిటీలో జరుగుతున్న సినిమా ఈవెంట్లపై సినిమా చూడాలని ఇస్తున్న సెలవులపై స్పందించాలని మల్లారెడ్డి యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తరచుగా సినిమా ఈవెంట్లూ నిర్వహిస్తూ విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలిగిస్తున్న మల్లారెడ్డి విద్యాసంస్థలపై ఉన్నత విద్యాశాఖ, యూజీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

- హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు ఫోన్ చేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- తుక్కుగూడ, మంఖల్ సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లిన రవి నాయక్

మహేశ్వరం, అక్టోబరు 26 (ప్రజా కలం): తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ, మంఖల్ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మాజీ కౌన్సిలర్ రవి నాయక్ కోరారు. ఈ మేరకు మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులతో కలిసి ఆదివారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సమయానికి తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. సమస్యను తీవ్రంగా పరిగణించిన సబితా ఇంద్రారెడ్డి వెంటనే హెచ్‌ఎండీఏ శంషాబాద్ జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్లు వేయించి



అయినా తాగునీటి అవసరాలు తీర్చాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, మాజీ వార్డు సభ్యులు కుమార్ సాగర్, కర్నాటి సుధాకర్ గౌడ్, సీనియర్ నాయకులు దానయ్య, తుళ్ల సుధాకర్, మంఖల్ 7వ డివిజన్ అధ్యక్షుడు కప్పల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చేతుల మీదుగా "హజ్రత్ జిందాషా మదార్ హెచ్ఎంటీ కాలనీ దర్గా" ఉర్స్ ఈ షరీఫ్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) 128 – చింతల్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీ హజ్రత్ జిందాషా మదార్ దర్గాలో ఈనెల 29వ తేదీ నుంచి 30వ తేది వరకు నిర్వహించనున్న "ఉర్స్ ఈ షరీఫ్" వాల్ పోస్టర్ ను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సోమవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో దర్గా కమిటీ ప్రెసిడెంట్ ఎం.డి.అబ్దుల్ ఖాదర్, ఎండి.రియాజ్, ఎస్.కే.బాబుమియా, ఎస్.కె అలీ, షేక్ చాంద్, ఎస్.కె.తాజ్, బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ హుస్సేన్, ఫిరోజ్, మన్సూర్ అలీ, ఎండి. యూసుఫ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మోతె జెడ్పీ హైస్కూల్‌లో అధునాతన గ్రంథాలయం ప్రారంభం

- రూ. 11 లక్షల వ్యయంతో దాత గంగారెడ్డి ఏర్పాటు
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్,

(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 26:

సమాజంలో అన్ని దానాల కంటే విద్యా విజ్ఞానాన్ని పంచే జ్ఞానదానమే అత్యున్నతమైనదని బాల్కొండ శాసనసభ్యులు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ మండలం మోతె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివంగత అల్లపుల్ల రాజయ్య స్మారకార్థం సుమారు రూ. 11 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన గ్రంథాలయాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెజ్జ గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ నందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ.. నేటి స్వార్థపూరిత సమాజంలో తన పరిమిత ఆదాయం నుంచే సమాజ హితం కోసం నిధులు వెచ్చిస్తున్న దాత గంగారెడ్డి ఒక ఆణిముత్యం లాంటి వారని కొనియాడారు. గంగారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆయన సతీమణి వసంత, కుమారుడు శ్రేయాంశ్ మద్దతుగా నిలవడం ఆదర్శనీయమన్నారు. కేవలం డబ్బులు ఇవ్వడమే కాకుండా, విద్యార్థులకు ఈ గ్రంథాలయం ఏ విధంగా ఉపయోగపడాలనే అంశంపై గంగారెడ్డి వందలాది గంటల సమయాన్ని వెచ్చించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం అభినందనీయమన్నారు.



6,000 పుస్తకాలు.. 6,000 మంది స్నేహితులు గ్రంథాలయంలో ఏకంగా 6,000 పుస్తకాలను అందుబాటులోకి తెచ్చి, విద్యార్థులకు 6,000 మంది మంచి స్నేహితులను దాత బహూకరించారని ఎమ్మెల్యే తెలిపారు. తరగతి గది పాఠ్యపుస్తకాలు కేవలం పరీక్షల ఉత్తీర్ణతకే పరిమితమవుతాయని, కానీ గ్రంథాలయ పుస్తకాలు లోకజ్ఞానాన్ని, మహనీయుల చరిత్రలను, సంస్కారాన్ని నేర్పుతాయని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చదివిన పుస్తకాల అంశాలపై సమీక్షలు చేస్తూ, ఆ వీడియోలను సోషల్ మీడియాలో ప్రదర్శించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దాతగా గంగారెడ్డి తన బాధ్యతను పూర్తి చేశారని, ఇకపై పిల్లలను గ్రంథాలయ బాట పట్టించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదేనని ఉద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వసంత్ రెడ్డి, ఉపసర్పంచ్ పరంజ్యోతి, పీఏసీఎస్ ఛైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ పెద్దోళ్ల గంగారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నేతలు శంకర్, కిషన్, శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు బాలరాజు, డోళ్ళ రాజేశ్వర్, భూపాల్, తెలుగు ఉపాధ్యాయిని శ్రావణి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com



ఓటు ప్రాముఖ్యతను యువతకు తెలియజేసి పట్టభద్రుల ఎన్నికల్లో సరైనా గుణపాఠం చెప్పేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలి

:ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి గండిమైసమ్మ (డి.పోచంపల్లి) మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను పురస్కరించుకొని నిర్వహించిన అవగాహన సదస్సుకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు అతిథులుగా హాజరై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ....

మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి. గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి 70 శాతం ప్రజలు కోరుకుంటున్నారని, ఎన్నికలెప్పుడు వస్తాయి, కేసీఆర్ ని మళ్లీ ముఖ్యమంత్రి ఎప్పుడూ చేస్తామని ప్రజలు ఎదురుచూస్తున్నారు. నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషి చేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో మంచి మెజారిటీ కుత్బుల్లాపూర్ నుంచి సాధించేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలి. ఈకార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

-భారతీయ కిసాన్ సంఘ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కాటం ఐలేష్ కుమార్

బొమ్మలరామారం,అక్టోబర్ 26 (ప్రజా కలం)

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరంగల్ లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ ను యధాతధంగా అమలు పరచాలని,ఎల్ నినో ప్రభావంతో రైతులు నీరు లేక అతలాకుతలం అవడంతో వెంటనే యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని భారతీయ కిసాన్ సంఘ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కాటం ఐలేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం మండలంలో "చలో మండల ఆఫీస్" కార్యక్రమాన్ని సోమవారం రోజున నిర్వహించి మండల తహసిల్దార్ పి.రాధకు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాటం అయిలేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరంగల్లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ ను యధాతధంగా అమలు పరచాలని ప్రభుత్వాన్ని కోరారు రైతులకు రుణమాఫీ చేయాలని అని అన్నారు,రైతు భరోసా కింద ఎకరాకు 15 వేల రూపాయలు ఇవ్వాలని అని అన్నారు, కౌలు రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరాకు 15000 ఇవ్వాలని అని అన్నారు, పంటలకు బీమా కల్పించాలని అన్నారు.జిల్లా యంత్రాంగం ఎల్ నినో పరిస్థితులను సమీక్షించి వెంటనే యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని అన్నారు పశువులకు పశు గ్రాసాన్ని ప్రభుత్వమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బెజ్జంకి పాపిరెడ్డి, మండల కమిటీ సభ్యులు గురువారెడ్డి,ముఖ్యుర్ల గణేష్, సిద్దంకి బాబు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లో తీవ్ర వాయుకాలుష్యం..

హైదరాబాద్ : రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం స్లో పాయిజన్‌లా మారి మనుషుల ప్రాణాలు తీసేస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డి నగరాల్లో గాలి నాణ్యత క్షీణిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతాల్లో వాహనాల పొగ, పరిశ్రమల వ్యర్థాలు, రోడ్లపై లేచే దుమ్ము, ధూళి, నిరంతర నిర్మాణ కార్యకలాపాల వల్ల ఆరోగ్యకరమైన గాలి వీచడం కష్టంగా మారింది. 2025-26 వార్షిక సగటు గణాంకాల ప్రకారం, సూక్ష్మ ధూళి కణాలైన పీఎం-10 స్థాయిలు జాతీయ ప్రమాణాలను మించి నమోదవడంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. హైదరాబాద్‌లో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం అధికంగా కాలుష్యం నమోదు కాగా, సంగారెడ్డిలో 30 శాతం, నల్గొండలో 18.3 శాతం మేర అధికంగా నమోదవుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం, గాలిలో పీఎం-10 వార్షిక సగటు క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించరాదని నిపుణులు చెబుతున్నారు. అయితే 2025-26 లెక్కల ప్రకారం హైదరాబాద్‌లో ఈ స్థాయి 80 మైక్రోగ్రాములు ఉండగా, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పీఎం-10 వార్షిక సగటు కేవలం 15 మైక్రోగ్రాములు మాత్రమే ఉండాలి. కానీ హైదరాబాద్‌లో దబ్ల్యూహెచ్ఓ పరిమితి కంటే 5.3 రెట్లు ఎక్కువగా ఉండగా, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు అధికంగా ప్రమాదకర స్థాయిల్లో కాలుష్యం ఉంది.

నేటి సమాజంలో బాలికలు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి-

భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వాతి



భువనగిరి పట్టణం,
అక్టోబర్ 26 (ప్రజా కలం)

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ,యాదాద్రి భువనగిరి ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సురక్షిత బచ్‌పన్ అభియాన్" – లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012 (ూూజూూ ూూష్, 2012) పై దేశవ్యాప్తంగా పాఠశాల బాల బాలికలకు అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని దేదీప్య పాఠశాలలో అవగాహన సదస్సును సోమవారం రోజున భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్వాతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి విద్యార్థిని,విద్యార్థులకు పోక్సో చట్టంలోని అంశాలు,శిక్షలు, నేటి సమాజంలో బాలికలు సోషల్ మీడియా వట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులకు అందిస్తున్న నష్ట పరిహారం,పిల్లలకు కల్పించబడుతున్న న్యాయ సేవల అంశాలపై అవగాహన కల్పించారు భరోసా కేంద్రం ఎస్.ఐ సంధ్య మాట్లాడుతూ డిజిటల్ వ్యవస్థ ఎంత ఎదుగుతుందో,ఆ వ్యవస్థ పట్ల అప్రమత్తంగా ఉండకపోతే చాలా నష్టం జరుగుతుందని, బాధితులకు అన్ని సేవలు అందించటానికి భరోసా కేంద్రం కృషి చేస్తుందని తెలిపారు. న్యాయ సహాయ న్యాయవాది సి.హెచ్ సరిత న్యాయ సహాయం,అర్హతలు, బాధితులకు అందించే నష్ట పరిహారం న్యాయ సేవ సంస్థ పరిదిల అంశాలపై వివరించారు.పాఠశాల కరెస్పాండెంట్ రంగా రావు మాట్లాడుతూ పాఠశాలలో చదువు,క్రమశిక్షణ,సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వారి అభివృద్ధికి ఇలాంటి కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు న్యాయ సేవ అధికార సంస్థ నిర్వహిస్తున్న ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతో ఉపయోగమని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శేషగిరి రావు, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి జయంతి వేడుకల్లో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నెరాజు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సాయిబాబా నగర్ డివిజన్ రామ్ లీలా మైదానంలో బోయ సోదరులు ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మహర్షి వాల్మీకి గొప్పతనం, ఆయన జీవితం, సమాజానికి అందించిన సందేశాల గురించి మన్నె రాజు వివరించారు. అనంతరం బోయ సోదరులు తమకు ఒక సామాజిక భవనం అవసరమని మన్నె రాజుని కోరారు. దీనిపై స్పందించిన ఆయన, బోయల కోసం స్థలం ఏర్పాటు చేసి, భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

ఈవిషయంపై తక్షణమే జిల్లా కలెక్టర్ తో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బోయ సోదరులు లక్ష్మణ్, రామకృష్ణ, అజయ్‌తో పాటు పలువురు బోయ సోదరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి, సత్తిరెడ్డి, గురువారెడ్డి, గణేష్, సాయిరెడ్డి, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

ఎదురుదాడులా.. లీగల్ నోటీసులా..

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి అనుసరిస్తున్న వ్యూహాలు తీవ్ర ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కోసం కొండపోచమ్మ సాగర్ కాలువ ద్వారా నీటిని మళ్లించారంటూ మీడియాలో వచ్చిన కథనాలు, కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలపై బీఆర్ఎస్ లీగల్ సెల్ వెంటనే రంగంలోకి దిగి లీగల్ నోటీసులు జారీ చేసింది. అంతకుముందు కూడా కేటీఆర్, హరీష్ రావుల పై ఎలాంటి ఆరోపణలు వచ్చినా.. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ వంటి అగ్రనేతలకు సైతం లీగల్ నోటీసులు వంవడమే ప్రథమ మార్గంగా ఎంచుకున్నారు. అయితే, రాజకీయ రణరంగంలో శత్రుపక్షాల బాణాలకు పదునైన రాజకీయ ఎదురుదా తో సమాధానమివ్వాల్సింది పోయి.. కోర్టుల చుట్టూ, నోటీసుల చుట్టూ తిరగడం బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణ లో పడేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఎదసాధారణంగా ప్రజాస్వామ్య రాజకీయంలో ప్రజల్లోకి బలంగా వెళ్లేది వ్యూహాత్మక ఎదురుదాడి మాత్రమే. ప్రత్యర్థి ఒక ఆరోపణ చేసినప్పుడు దానికి అంతే పదునైన ఆధారాలతో, మీడియా, బహిరంగ సభల వేదికగా కౌంటర్ ఇచ్చి ఆ నరేటివ్‌ను తిప్పికొట్టడమే రాజకీయ పరిణతి. కానీ బీఆర్ఎస్ నేతలు ప్రతి చిన్న విషయానికి 'కోర్టుకు వెళ్తాం, లీగల్ నోటీసులు పంపాం అనడం వల్ల.. ప్రజల్లో ఒక రకమైన భావన ఏర్పడే ముప్పు ఉంది. నోటీసులు పంపడం వల్ల ఐపీసీ, క్రమశిక్షణా పరిధిలో చట్టపరమైన రక్షణ లభిస్తుందేమో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆరోపణలు నిజమేనేమో, అందుకే మాట్లాడకుండా లీగల్ షీల్డ్ వెనుక దాక్కుంటున్నారు అనే సందేహాలకు ఆస్కారం లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో కేటీఆర్ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులకు లీగల్ నోటీసులు పంపిన ఘటనలు చూశాం. అయితే, భారతదేశంలో లీగల్ నోటీసు నోటీసుగానే మిగిలిపోయి, అవమాన నష్టపరిహారం కేసులు కోర్టుల్లో ఏళ్ల తరబడి సాగుతాయి. రాజకీయాల్లో ఎన్నికల ఫలితాలు, ప్రజాభిప్రాయం క్షణాల్లో మారిపోతుంటాయి. అలాంటప్పుడు న్యాయపరమైన నోటీసులు ఇచ్చి ప్రకటనలకు పరిమితమవ్వడం కంటే, మైక్ ముందు నిలబడి ఆధారాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తేనే పొలిటికల్ మైలేజ్ దక్కుతుంది. లీగల్ మార్గాన్ని ఆశ్రయించడంద్వారా ఆరోపణలను మరింత కాలం వార్తల్లో సజీవంగా ఉంచినట్లవుతోందనే విమర్శలు కూడా ఉన్నాయి. బీఆర్ఎస్ వర్గాలు మాత్రం తమ లీగల్ వ్యూహాన్ని గట్టిగా సమర్థించుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని పథకం ప్రకారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చేందుకు అసత్య ప్రచారాలు చేస్తోంది అని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయంగా మీడియా సమావేశాలు పెట్టి ఎన్ని కౌంటర్లు ఇచ్చినా, సామాజిక మాధ్యమాలు, అనుకూల మీడియా ద్వారా తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నందున.. దానికి చట్టపరమైన చెక్ పెట్టడమే సరైన మార్గమని పార్టీ భావిస్తోంది. నోటీసులు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో దుష్ప్రచారం చేసేవారిలో ఒక రకమైన భయం ఏర్పడుతుందని గులాబీ నేతలు వాదిస్తున్నారు. పొలిటికల్ మైండ్ గేమ్‌లో డిఫెన్స్ ఎప్పుడూ వీక్‌నెస్‌ను సూచిస్తుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిజేపిలు బీఆర్ఎస్ బలహీనతలను పసిగట్టి వరుసగా ఆరోపణల వర్షం కురిపిస్తున్న వేళ.. బీఆర్ఎస్ కేవలం లీగల్ సెల్ కారెక్టర్‌కే పరిమితమైతే రాజకీయంగా తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ప్రజలు నాయకుల నుంచి పదునైన వాగ్ధాటిని, ప్రజాక్షేత్రంలో వీరోచిత పోరాటాన్ని కోరుకుంటారు తప్ప, న్యాయవాదుల కాగితపు పోరాటాలను కాదని అంటున్నారు.

జాతీయ రాజకీయాల్లోకి కేసీఆర్

కమ్ బ్యాక్ సాధ్యమేనా?

హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి పరాజయానికి ప్రధాన కారణం తాము నడిపిన ఆర్భాటపు జాతీయ రాజకీయాలేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్వయంగా వందల సార్లు ఒప్పుకున్నారు. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు త్వరలోనే జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారి, ఢిల్లీ పీఠాన్ని శాసించే స్థాయిలో రీ-ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం రేపాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన అంబర్‌పేట్ నియోజకవర్గ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బలహీనపడుతోందని, అటు ప్రతిపక్ష కాంగ్రెస్ వైఫల్యాల వల్ల దేశంలో కాంగ్రెసేతర, బీజేపీయేతర శక్తుల అవసరం త్వరలోనే పరాకాష్ట కు చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఏకం చేయడంలో కేసీఆర్ మళ్లీ కీలకపాత్ర పోషిస్తారని స్పష్టం చేయడం గులాబీ శ్రేణుల్లో నయా ఉత్సాహాన్ని నింపింది. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడం వల్లే తెలంగాణ ఆత్మకు, ప్రజల మనోభావాలకు పార్టీ దూరమైందని మీడియా ముఖంగా ఎన్నోమార్లు విశ్లేషించారు. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో పాత జాతీయ నినాదాలను పక్కనపెట్టి, మళ్లీ పక్కా తెలంగాణ సెంటిమెంట్‌ను తెరపైకి తెచ్చి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ ఎన్నికల్లో సైతం ఒక్క లోక్‌సభ స్థానం కూడా దక్కకపోవడంతో ప్రజలు బీఆర్ఎస్ వైఖరిని ఎంత తీవ్రంగా తిరస్కరించారో తేలిపోయింది. హైదరాబాద్‌లో జరిగిన పార్టీ అంబర్ పేట సమావేశంలో కేటీఆర్ .. మాజీ సీఎం కేసీఆర్ త్వరలోనే జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని, కాంగ్రెస్, బీజేపీయేతర కూటమిని నడిపిస్తారని చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం గా మారింది. గతంలో చేసిన మహా తప్పిదం వల్ల అధికారం పోయిందని స్వయంగా అంగీకరించిన నాయకుడే.. ఇప్పుడు అదే తప్పును మరింత బాహాటంగా సమర్థిస్తూ మాట్లాడటం ఆయన రాజకీయ పరిపక్వత లోపానికే అద్దం పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోయి, అస్తిత్వ సంక్షోభం వెంటాడుతున్న తరుణంలో.. తెలంగాణ గడ్డపై పార్టీని నిలబెట్టుకోవాల్సింది పోయి, మళ్లీ ఢిల్లీ చక్రం తిప్పుతామంటూ ప్రక టనలు చేయడం తప్పు దిద్దుకోలేదన డానికి సాక్ష్యంగా కనిపిస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల నాటికి కేసీఆర్ కేవలం తెలంగాణకే పరిమితమైన నాయకుడిగా ఉండి, ఇక్కడి రైతాంగం, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై పూర్తి దృష్టి సారించి ఉంటే బీఆర్ఎస్ అంత ఘోరంగా ఓడిపోయేది కాదన్నది బహిరంగ రహస్యం. ప్రజలు ఆయనను తెలంగాణ బిడ్డ గా ఆదరించారే తప్ప, మహారాష్ట్ర, ఢిల్లీల్లో పర్యటించే జాతీయ నేతగా కాదన్న వాస్తవాన్ని బీఆర్ఎస్ అగ్రద్వయం గుర్తించలేకపోయింది. ప్రజలు ఇచ్చిన ఇంతటి భారీ గుణపాఠం తర్వాత కూడా మళ్లీ అదే జాతీయ రాజకీయం అనే నినాదాన్ని నెత్తికెత్తుకో వడం వల్ల బీఆర్ఎస్‌కు ఎటువంటి లాభమూ జరగకపోగా, తెలంగాణ ప్రజల్లో ఆ పార్టీపై ఉన్న కొద్దిపాటి సానుభూతి కూడా గల్లంతయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.



రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాల్సిన బాధ్యత ఉన్న సమయంలో.. క్షేత్రస్థాయి పోరాటాలను గాలికొదిలి మళ్లీ ఇతర రాష్ట్రాల పొత్తులు, జాతీయ ఫ్రంట్‌ల గురించి మాట్లాడటం రాజకీయంగా భారీ మైనస్‌గా మారక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఇప్పటికే తెలంగాణను తమ ప్రధాన ప్రయోగ శాలగా మార్చుకుని పావులు కదుపుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం ఇంకా భ్రమల్లోనే విహరిస్తోం దన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్తున్నాయి. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయి, అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న బీఆర్ ఎస్ నేతలు ప్రజల దృష్టిని మరల్చడానికే జాతీయ రాజకీయాలంటూ కొత్త నాటకాలాడుతున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. బిఆర్ఎస్ ఉనికికే ముప్పు ఏర్పడిన తరుణంలో జాతీయ స్థాయిలో మూడో కూటమిని నిర్మించడం సాధ్యపడదని, గతంలో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినా దేశవ్యాప్తంగా ఎలాంటి ప్రభావం చూపలేకపోయారని ప్రత్యర్థులు గుర్తుచేస్తున్నారు. కేసీఆర్ జాతీయ రీ-ఎంట్రీ ప్రకటన వెనుక అటు జాతీయ స్థాయిలో మారిన రాజకీయ సమీకర ణాలను పసిగట్టడమే కాకుండా, ఇటు తెలంగాణలో రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికల్లో పార్టీ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ద్విముఖ వ్యూహం ఉంది.

ఎమ్మెల్సీ ఎన్నికలు.. టీడీపీ దారెటు?

నల్గొండ : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. 2027 మార్చిలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకోసం హడావిడి మొద లైపోయింది. ముఖ్యంగా నల్గొండ-వరంగల్- ఖమ్మం నియోజకవర్గం ఎన్నికపై ఎన్డీయే కూటమిలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మధ్య పొత్తు కొనసాగుతోంది. అయితే తెలంగాణలో మాత్రం ఈ పార్టీల మధ్య పొత్తు లేదు. ఈ స్థానంలో పోటీ చేసేందుకు ఆయా పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంలో బిజీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తి రేపుతోంది.ఏపీలో కలిసి ప్రయాణిస్తున్న ఈ మూడు పార్టీల మధ్య సఖ్యత తెలంగాణ రాజకీయాల్లోనూ ప్రతిఫలిస్తుందా లేదా అనేదానిపై ఇప్పుడు సందిగ్ధత నెలకొంది. స్థానిక రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తెలంగాణలో ఇవన్నీ వేర్వేరుగా ఉంటున్నాయి.

వరంగల్ వట్ట భద్రుల ఎమ్మెల్సి స్థానాన్ని దక్కించుకోవా లని జనసేన ఇప్పటికే పావులు కదిపింది. ఆ పార్టీ తరఫున గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా కూడా ప్రకటించేసింది. మరోవైపు, బీజేపీ కూడా ఈ స్థానంలో పోటీ పడేందుకు గట్టి పట్టుదలతో ఉంది. కాషాయ పార్టీ నుంచి పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంక బిక్షం గౌడ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.బీజేపీ, జనసేన రెండు పార్టీలు బరిలోకి దిగాలని నిశ్చయించుకోవడంతో కూటమిలో అసలు చిక్కు వచ్చిపడింది.